# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 153, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం -15 - ఆగష్టు - 2025


## భారత్‌పై ట్రంప్ ఆగ్రహం.. 50 శాతం సుంకాల వెనుక అసలు కారణం ఇదీ: మాజీ దౌత్యవేత్త

భారత వస్తువులపై 50 శాతం మేర టారిఫ్‌లు విధించిన ట్రంప్

పాక్‌తో ఉద్రిక్తతల తగ్గుదలలో తన పాత్రను భారత్ గుర్తించలేదని ఆగ్రహం

'ఆపరేషన్ సింధూర్' కాల్పుల విరమణలో మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరించడం

బ్రిక్స్ కూటమిలో భారత్ సభ్యత్వంపై కూడా ట్రంప్ అసంతృప్తి

ట్రేడ్ చర్చల్లో అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలొగ్గలేదని వెల్లడి



## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం ..

ఏడు గేట్లు ఎత్తి నీరు విడుదల

జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1,17,221 క్యూసెక్కుల వరద నీరు

శ్రీశైలం ఏడు గేట్లు పది అడుగుల మేర ఎత్తి 1,87,208 క్యూసెక్కుల నీరు సాగర్ కు విడుదల



## జమ్ము కశ్మీర్ లో క్లౌడ్ బరస్ట్... 12 మంది మృతి

జమ్మూకాశ్మీర్ కిష్త్వార్ జిల్లాలో కుండపోత వర్షం ఘటనలో 12 మంది మరణించినట్లు అధికారుల నిర్ధారణ

ప్రముఖ మచైల్ మాత యాత్ర తాత్కాలికంగా రద్దు

రంగంలోకి దిగిన సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

పరిస్థితిని సమీక్షిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్ర మంత్రులు



## ఒంటిమిట్ట, పులివెందులలో
# తెదేపా ఘన విజయం..

పులివెందుల విజయంపై టీడీపీ నేతలంతా మాట్లాడాలి..

రాష్ట్ర ప్రజలందరికీ తెలియాలి

పులివెందులలో పరిస్థితులను ప్రజలు గమనించారన్న చంద్రబాబు

30 ఏళ్ల తర్వాత చరిత్రను తిరగరాశామని వ్యాఖ్య

జగన్ అరాచకాల నుంచి ప్రజలు బయటపడుతున్నారన్న చంద్రబాబు






అమరావతి: పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,050 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డికి డిపాజిట్ కూడా దక్కకపోవడంతో టీడీపీ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఈ ఘన విజయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి కాబట్టే మిగతా..2లో

## హైడ్రా తీరుపై మరోసారి
# హైకోర్టు ఆగ్రహం

మీరేమైనా యుద్ధానికి వెళ్తున్నారా?.. వాహనాలకు ఆ రంగులేంటి?

తీరు మార్చుకోకుంటే కఠిన నిర్ణయాలు



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 37, 38/1లో 1.07 ఎకరాల భూమిపై ఎందుకంత దూకు డుగా వెళ్తున్నారని హైడ్రా (హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి సంరక్షణ విభాగం) కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెప్పినా వినకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, కొందరు దీన్ని వాడుకుని ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పేర్కొంది. చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ పేరుతో ప్రజలను అవస్థలకు గురిచేయడం, హడావుడి చేయడం ఎందుకని ప్రశ్నించింది. సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్తున్నట్లు వాహనాలకు ఆ రంగులేంటని అడిగింది. ఇలానే చట్టవిరుద్ధంగా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తే కోర్టుకు రప్పించి.. కఠిన శిక్షలు విధించడానికి మిగతా..2లో



## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నేతలను వెంటనే విడుదల చేయాలి

పోడు భూముల పట్టాల కోసం పోరాడుతున్న నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారన్న కేటీఆర్

రేవంత్ ప్రభుత్వ గూండాగిరికి ఇది నిదర్శనమని మండిపాటు

పోడు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్

## తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయండి: సుప్రీంకోర్టు

65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి

వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలి



బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది

పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు'

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై మిగతా..2లో

## ఏపీలో రాగల 24 గంటల్లో పలు జిల్లాలకు
## 'ఫ్లాష్ ఫ్లడ్' ముప్పు: ఐఎండీ అలర్ట్

బంగాళాఖాతంలో అల్పపీడనంతో కోస్తాంధ్రలో కుండపోత వర్షాలు

కోస్తా, యానాంకు ఆకస్మిక వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ హెచ్చరిక

ప్రకాశం బ్యారేజీకి 4 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ సూచన





## పులివెందులలో 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛ

పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థుల గెలుపు

30 ఏళ్ల తర్వాత ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారన్న లోకేశ్

తిరోగమనాన్ని కాదని, పురోగతిని ఎంచుకున్నారన్న టీడీపీ నేత

విజయం సాధించిన లతారెడ్డి, కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు

భారీగా తరలివచ్చి మద్దతిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు

## భారీ వర్షాలు..
## ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి




సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల

సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలి

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ

వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలి

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి
# ఏర్పాట్లు చేయాలి

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్‌సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సమీక్షలో సీఎం వెల్లడి

మంత్రి పొంగులేటితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. "రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని పరిశీలించాలి. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి. హైదరాబాద్‌లో హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కోర్ అర్బన్ ఏరియాలో కొత్తగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, మిగతా..2లో




## తెలంగాణలో రాగల మూడు రోజుల్లో అతి భారీ వర్షాలు

తెలంగాణకు ఐదు రోజుల పాటు భారీ వర్ష సూచన

జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల తదితర జిల్లాల్లో అతి భారీ వర్షాలు

వరంగల్, జనగాం సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మిగతా..2లో

# జమ్ము కశ్మీర్ లో క్లౌడ్ బరస్ట్... 12 మంది మృతి

జమ్మూకాశ్మీర్: జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చోసోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ (కుండపోత వర్షం) కారణంగా సంభవించిన జల ప్రళయంలో 12 మంది మరణించారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో, అధికారులు ప్రముఖ మచైల్ మాత యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మచైల్ మాత ఆలయానికి వెళ్లే మార్గంలో వాహనాలు ప్రయాణించడానికి వీలున్న చివరి గ్రామాల్లో చోసోటి ఒకటి కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, పద్దార్ సబ్-డివిజన్‌లో ఉన్న ఈ గ్రామంలో ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. సమాచారం అందుకున్న వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా డిప్యూటీ కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ, ఎస్ఎస్పీ నరేష్ సింగ్ నేతృత్వంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలోని ఒక బృందం ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక కార్యక్రమాలను ప్రారంభించింది. సైన్యం, జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణనష్టం జరగడంపై విచారం ప్రకటిస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సివిల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసు, సైనిక బలగాలను ఆదేశించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా... కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. కిష్త్వార్‌లోని క్లిష్ట పరిస్థితులను, సహాయక చర్యల వివరాలను ఆయనకు వివరించారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం ఆలస్యంగా అందుతోందని, అందుబాటులో ఉన్న అన్ని వనరులను సహాయక చర్యల కోసం సమీకరిస్తున్నామని ఆయన అన్నారు. మరోవైపు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఈ ఘటనను ధృవీకరించారు. పరిపాలన యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయక బృందాలను పంపిందని, నష్టాన్ని అంచనా వేస్తూ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారని ఆయన వివరించారు.

# భారత్‌పై ట్రంప్ ఆగ్రహం.. 50 శాతం సుంకాల వెనుక అసలు కారణం ఇదీ: మాజీ దౌత్యవేత్త

ఢిల్లీ: భారత ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా 50 శాతం మేర భారీ సుంకాలు విధించడం వెనుక బలమైన కారణాలున్నాయని ప్రముఖ రచయిత, మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ తెలిపారు. అందులో ప్రధానమైనది 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తగ్గించడంలో తన పాత్రను భారత్ గుర్తించకపోవడమేనని ఆయన సంచలన విశ్లేషణ చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిళ్లతో పాటు, ట్రంప్ వ్యక్తిగత అసంతృప్తి కూడా ఈ కఠిన నిర్ణయానికి దారితీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వికాస్ స్వరూప్ ఈ విషయాలను వెల్లడించారు. "భారత్‌పై ట్రంప్ ఇంత ఆగ్రహంగా ఉండటానికి మూడు ముఖ్య కారణాలున్నాయి. మొదటిది, పాకిస్థాన్‌తో అణుయుద్ధం ముప్పును తానే ఆపానని ట్రంప్ దాదాపు 30 సార్లు చెప్పారు. కానీ, ఆ కాల్పుల విరమణలో బయటివారి మధ్యవర్తిత్వాన్ని మేం అంగీకరించబోమని భారత్ మొదటి నుంచి స్పష్టం చేస్తూ వస్తోంది. అది కేవలం భారత్, పాకిస్థాన్ డీజీఎంఓల మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల ఫలితమని చెబుతోంది. దీంతో తన పాత్రను గుర్తించలేదని ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు పాకిస్థాన్ ఆయన పాత్రను గుర్తించడమే కాకుండా, నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేసింది. ఇది ట్రంప్ కోపానికి ఆజ్యం పోసింది" అని స్వరూప్ వివరించారు. ట్రంప్ అసంతృప్తికి రెండో కారణం బ్రిక్స్ కూటమి అని స్వరూప్ తెలిపారు. "బ్రిక్స్ ఒక అమెరికా వ్యతిరేక కూటమి అని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ట్రంప్ భావిస్తున్నారు. అందువల్ల ఆ కూటమిలో భారత్ సభ్యత్వాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఇక మూడో కారణంగా, వాణిజ్య చర్చల్లో భాగంగా తమ వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు భారత మార్కెట్‌లో మరింత ప్రాముఖ్యత కల్పించాలన్న అమెరికా డిమాండ్లకు భారత్ తలొగ్గకపోవడమేనని ఆయన అన్నారు. ఈ ఒత్తిడి వ్యూహాల్లో భాగంగానే సుంకాలను ఆయుధంగా వాడుతున్నారని విశ్లేషించారు. కెనడాలో భారత మాజీ హైకమిషనర్‌గా పనిచేసిన వికాస్ స్వరూప్, ప్రఖ్యాత 'క్యూ అండ్ ఏ' నవలా రచయితగా కూడా సుపరిచితులు. కాగా, గత జులైలో భారత వస్తువులపై 25 శాతం సుంకాలు ప్రకటించిన ట్రంప్, కొద్ది రోజులకే రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటున్న చమురుపై మరో 25 శాతం సుంకం విధించి, మొత్తం భారాన్ని 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం .. ఏడు గేట్లు ఎత్తి నీరు విడుదల

శ్రీశైలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సుంకేశుల, జూరాల నుంచి 1,17,221 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. ఈ క్రమంలో ఏడు గేట్లు పది అడుగుల మేర ఎత్తి 1,87,208 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 65,632 క్యూసెక్కులను అదనంగా నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటి మట్టం నేటి ఉదయానికి 882.10 అడుగులకు చేరుకుంది. ప్రస్తుత నీటి నిల్వ 199.2737 టీఎంసీలుగా నమోదయింది.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నేతలను వెంటనే విడుదల చేయాలి

హైదరాబాద్: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా పలువురు ఇతర నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోడు భూముల పట్టాల కోసం పోరాడుతున్న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతులకు అండగా నిలిచినందుకు బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. రైతుల చేతికి సంకెళ్లు వేశారని, వారి కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేశారని... ఇది రేవంత్ ప్రభుత్వ గూండాగిరికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. పోడు రైతులను వేధించడం మాని, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న ప్రవీణ్ కుమార్, ఇతర బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని అన్నారు.

# పులివెందులలో 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛ పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థుల గెలుపు

అమరావతి: కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితాలపై మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత పులివెందులలో తొలిసారిగా నిజమైన ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇది ఎంతో కష్టపడి సాధించిన విజయమని అభినందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు తిరోగమనాన్ని కాదని, పురోగతికి పట్టం కట్టారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థుల విజయం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన మారెడ్డి లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల మద్దతుతోనే ఈ విజయం సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు.

# హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం



తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెప్పినా వినకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, కొందరు దీన్ని వాడుకుని ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పేర్కొంది. చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ పేరుతో ప్రజలను అవస్థలకు గురిచేయడం, హడావుడి చేయడం ఎందుకని ప్రశ్నించింది. సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్తున్నట్లు వాహనాలకు ఆ రంగులేంటని అడిగింది. ఇలానే చట్టవిరుద్ధంగా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తే కోర్టుకు రప్పించి.. కఠిన శిక్షలు విధించడానికి వెనుకాడబోమని తేల్చిచెప్పింది. తన భూమిలో హైడ్రా చట్టవిరుద్ధంగా జోక్యం చేసుకుంటోందంటూ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వర్‌రావు ఏప్రిల్ 23న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో ఇద్దరు పిటిషన్లు వేశారు. మొత్తంగా 6 ఎకరాల భూమి తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందంటూ హైడ్రా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారించారా?

హైకోర్టు ఏప్రిల్ 23న ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా తమ భూమిలో జోక్యం చేసుకునేందుకు యత్నిస్తోందని జూన్ 11న వెంకటేశ్వర్‌రావుతోపాటు మరో ఇద్దరు ధిక్కరణ పిటిషన్లు వేశారు. వీటిపై బుధ వారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మా సనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తరుణ్ జి.రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు ఇచ్చినా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ లెక్కచేయలేదని, తమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించకుండానే దూకుడుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వాదన లు విన్న న్యాయమూర్తి.. హైడ్రా కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు.. హడావుడి నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తు న్నారన్నారు. తాము నిలుపుదల ఆదేశాలు ఇవ్వని చెరువులున్న ప్రాంతాల్లో మునకపై ఏ చర్యలు తీసుకున్నారని, ఎఫ్‌టీఎల్‌పై ఇప్పటివరకు విధాన పరమైన నిర్ణయం తీసుకున్నారా అని నిలదీశారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి



కార్యక్రమంలో సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సీసీఎల్ఏ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హన్మంతు, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో జాతీయ పతాకం ఎగురవేయనున్న సీఎం

గోల్కొండ కోటలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. జిల్లాల వారీగా జాతీయ జెండాను ఎగురవేయనున్న మంత్రులు, విప్‌లు, ప్రభుత్వ సలహాదారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గోల్కొండ కోటలో జాతీయ పతాకం ఎగురవేయనున్న సీఎం

ఆదిలాబాద్-షబ్బీర్‌అలీ, భద్రాద్రి కొత్తగూడెం- తుమ్మల నాగేశ్వరరావు, హనుమకొండ- కొండా సురేఖ, జగిత్యాల- అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జయశంకర్ భూపాలపల్లి-బెల్లయ్యనాయక్, జనగామ-బీర్ల ఐలయ్య, జోగులాంబ గద్వాల-జితేందర్‌రెడ్డి, కామారెడ్డి-కోదండరెడ్డి, కరీంనగర్-డి.శ్రీధర్‌బాబు, ఖమ్మం-భట్టి విక్రమార్క, కుమురంభీం ఆసిఫాబాద్-బండా ప్రకాశ్, మహబూబాబాద్-రామచంద్రునాయక్, మహబూబ్‌నగర్-జూపల్లి కృష్ణారావు, మంచిర్యాల-హర్కర వేణుగోపాల్‌రావు, మెదక్-వివేక్ వెంకటస్వామి, మేడ్చల్ మల్కాజిగిరి-కె.కేశవరావు, ములుగు-సీతక్క, నాగర్‌కర్నూల్-చిన్నారెడ్డి, నల్గొండ-కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నారాయణపేట-వాకిటి శ్రీహరి, నిర్మల్-సిరిసిల్ల రాజయ్య, నిజామాబాద్-నిరంజన్, పెద్దపల్లి-మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ సాహెబ్, రాజన్న సిరిసిల్ల-ఆది శ్రీనివాస్, రంగారెడ్డి-వేం నరేందర్‌రెడ్డి, సంగారెడ్డి-దామోదర్ రాజనర్సింహ, సిద్దిపేట-పొన్నం ప్రభాకర్, సూర్యాపేట-ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వికారాబాద్-గడ్డం ప్రసాద్‌కుమార్, వనపర్తి-పట్నం మహేందర్‌రెడ్డి, వరంగల్-పొంగులేటి శ్రీనివాసరెడ్డి, యాదాద్రి భువనగిరి-గుత్తా సుఖేందర్‌రెడ్డి.

# ఒంటిమిట్ట, పులివెందులలో తెదేపా ఘన విజయం..

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి కాబట్టే పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఏకంగా 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని చంద్రబాబు అన్నారు. 30 ఏళ్ల తర్వాత ఓటు వేశామంటూ బ్యాలెట్ బాక్సుల్లో ఓటర్లు స్లిప్పులు పెట్టారని... పులివెందులలో పరిస్థితులు ఎలా ఉన్నాయనేది ప్రజలు గమనించారని చెప్పారు. ఈ విజయంపై టీడీపీ నేతలంతా మాట్లాడాలని సూచించారు. ప్రజలను చైతన్యం చేసే విధంగా నేతలు స్పందించాలని చెప్పారు. 30 ఏళ్ల తర్వాత చరిత్రను తిరగరాశామని అన్నారు. జగన్ అరాచకాల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారని చంద్రబాబు చెప్పారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు ధైర్యంగా ఓటు వేశారనే విషయాన్ని రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయాలని మంత్రులకు సూచించారు.




**ఒంటిమిట్ట, పులివెందులలో తెదేపా ఘన విజయం.. చతికిలపడిన వైకాపా**

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు ఘోర పరాభవం ఎదురైంది. ఫలితాల్లో తెదేపా అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. ఆమె 6,035 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు లభించాయి. ఈ స్థానానికి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీపడ్డారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైంది. తెదేపా అభ్యర్థిని మంత్రి సవిత అభినందించారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందే పులివెందులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందుల కోటను బద్దలు కొడతామన్నారు. ఈ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఒంటిమిట్టలో తెదేపా విజయం

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఈ ఉప ఎన్నికలో ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు రాగా, .. వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# ఏపీలో రాగల 24 గంటల్లో పలు జిల్లాలకు 'ఫ్లాష్ ఫ్లడ్' ముప్పు: ఐఎండీ అలర్ట్

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం అతలాకుతలమవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలతో పలు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఈ నేపథ్యంలో, రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాలకు ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) సంభవించే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు యానాంలో ఈ ముప్పు అధికంగా ఉందని స్పష్టం చేయడంతో అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 4 లక్షల క్యూసెక్కులు దాటుతుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. నదీ పరివాహక ప్రాంతాలు, లంక గ్రామాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ఎవరూ వరద నీటిలో ఈతకు వెళ్లవద్దని, చేపల వేట కోసం నదిలోకి ప్రవేశించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. నాటు పడవలపై ప్రయాణాలు ప్రమాదకరమని హెచ్చరించారు. ముందుజాగ్రత్త చర్యగా కళింగపట్నం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం పోర్టులలో ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత అల్పపీడనం శుక్రవారానికి మరింత బలపడి పశ్చిమ వాయవ్య దిశగా ఉత్తరాంధ్ర-ఒడిశా వైపు కదిలే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో మరో వారం రోజుల పాటు వర్షాలు కొనసాగవచ్చని ఆయన అంచనా వేశారు. గురువారం నాడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విజయనగరం, నంద్యాల, పల్నాడు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై మరోసారి సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం(ఆగస్టు 14వ తేదీ) విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. కాగా, బీహార్లో ఎన్నికల సంఘం హడావుడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. మరోవైపు ఈ జాబితా సవరణలోని లోపాలు ప్రతీ రోజూ బయటపెడుతూనే ఉన్నాయి. వీటిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయ. మరొకవైపు ఈసీ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, అనర్హులైన ఓటర్లను తొలగిస్తూ, ఓటర్ల జాబితాను శుద్ధి చేసేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరణ ఇస్తూ వస్తోంది.. అయితే ప్రతిపక్షాలు ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇంతలో లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర, కర్నాటకలలో ఓటర్ల జాబితాలో ఓట్ల చోరీని ఆధారాలతో సహ బయటపెట్టడంతో పాటు బీహార్ లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపైనా పలు విమర్శలు గుప్పిస్తున్నారు.

# భారీ వర్షాలు.. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

హైదరాబాద్: వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.

# తెలంగాణలో రాగల మూడు రోజుల్లో అతి భారీ వర్షాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాగల ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రేపటి నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో... ఎల్లుండి ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో, ఆ తర్వాత రోజు ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, జగిత్యాల, జనగాం, కరీంనగర్ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# రాహుల్ గాంధీ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తాం: రఘునందన్ రావు

హైదరాబాద్: రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. బ్యాలెట్ పేపర్ కాదని నాటి రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్లు, బీహార్‌లో ఓడిపోతామని భావించి ఈవీఎంలు పనిచేయడం లేదని అంటారా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ రాయ్‌బరేలీలో గెలిచారని, అక్కడ రెండు లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయని అన్నారు. అక్కడ ఆయన దొంగ ఓట్లతో గెలిచారని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరనున్నామని తెలిపారు. బెంగాల్‌లో డైమండ్ హార్బర్ నియోజకవర్గంపై, ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ అర్ధాంగి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై అనుమానాలు ఉన్నట్లు రఘునందన్ రావు పేర్కొన్నారు. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదని మండిపడ్డారు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్



ఏలూరు జిల్లా ప్రతినిధి – ప్రసాద్ (శుభోదయం న్యూస్): ఏలూరు జిల్లా చింతలపూడి మండలం అంథోని నగర్ వద్ద హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని తన దేశ భక్తిని చాటిన చింతలపూడి శాసనసభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలకు దేశభక్తి కలిగి జాతీయ సమైక్యతకు సమగ్రతకు కృషి చేయాలన్నారు. దేశంలోని పౌరులు అందరు తమ ఇంటి వద్ద జాతీయ జెండాను పెట్టడం ద్వారా జాతీయభావం ఉట్టిపడుతుందన్నారు.

## దేశాన్ని పరిరక్షించుకోవాల్సినద బాధ్యత ప్రజాస్వామ్య వాదులందరి పైనా ఉంది

ప్రముఖ విద్యావేత్త డా. అలుగు ఆనంద శేఖర్








ఏలూరు జిల్లా ప్రతినిధి – ప్రసాద్ (శుభోదయం న్యూస్): మోసపూరిత రాజకీయ నాయకుల నుండి ఈ దేశాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఈ దేశంలో ఉన్న ప్రజాస్వామ్య వాదులందరి పైనా ఉందని ప్రముఖ విద్యావేత్త డా. అలుగు ఆనంద శేఖర్ పేర్కొన్నారు. బ్రాహ్మణీయ రాజ్యాంగాలుగా చలామణి అవుతున్న శారదా స్మృతి,నారద స్మృతి, యజ్ఞవల్క స్మృతి, మనుస్మృతి వంటి అశాస్త్రీయ, అమానవీయ గ్రంథాల ప్రభావం భారతీయ సమాజంపై నేటికి తీవ్రంగా ఉందని,దాని నుండి భారతీయులందరూ మానసికంగా, సామాజికంగా బయట పడాలని అప్పుడే చుండూరు, కారంచేడు వంటి మారణ కాండలకు ముగింపు పలకగలమని చెప్పారు.ఇటీవల భీమడోలులో జరిగిన చుండూరు అమర వీరుల సభకు డా. మొండెం సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి చాగంటి సంజీవ్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎన్ ఎ డి పాల్, దాసరి ప్రకాష్ కుమార్, నూకపెయ్యి కార్తీక్, గొల్ల కిరణ్, ఈదా వెంకట రత్నం, అంబటి నాగేంద్ర, తలారి రాము పాల్గొని ప్రసంగించారు.ముందుగా చుండూరు మృత వీరుల చిత్ర పటాలకు పులాభిషేకం చేసి నివాళులు అర్పించారు.

## ధర్మాజీగూడెం సహకార సంఘాన్నీ ఆదర్శ సొసైటీగా అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యే రోషన్ కుమార్



ఏలూరు జిల్లా ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్ ): ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్.

రైతన్నకి ఆర్థిక చేయూతనందిస్తూ వారి ఉన్నతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకార సంఘాలు దోహద పడాలన్నారు. రైతు సోదరులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రోషన్ కుమార్ కోరారు. ఈ సహకార సంఘాలను లాభాల బాటలో నడిపించడానికి కొత్తగా నియమించబడిన కార్యవర్గం ఉత్సాహంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా ఈ కార్యవర్గము పనిచేయాలని చింతలపూడి శాసనసభ్యులు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా - ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా

ఏలూరు జిల్లా ప్రతినిధి– ప్రసాద్ (శుభోదయం న్యూస్): ఏలూరు జిల్లా స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్సిసి విభాగం












నేతృత్వంలో విద్యార్థులందరూ మువ్వన్నెల జెండాలను పట్టుకుని ర్యాలీ గా అంతోని నగర్ చేరుకున్నారు. అక్కడ గల ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి జైహింద్ నినాదాలు చేశారు. అధ్యాపకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీ గారి పిలుపుతో కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు కళాశాల ప్రిన్సిపల్ వారి అనుమతితో నిర్వహించామని, ఈ కార్యక్రమం ద్వారా భారతీయులందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్థానికులకు మువ్వన్నెల జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాత గోవింద మాంబకు శ్రావణ మాస సారే చీర పసుపు కుంకుమ ఉత్సవాలు...



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్): కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో గోవింద మాంబా సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో శ్రావణ మాసం సందర్భంగా అమ్మ వారి సారే చీర పసుపు కుంకుమ కార్యక్రమం శ్రీ బ్రహ్మణి సేవా సంస్థ కడప ఆధ్వర్యంలో గత సంవత్సరం తరహాలోనే ఈ సంవత్సరం కూడా చేస్తున్నట్టు అధ్యక్షురాలు శ్రీమతి అంకిరెడ్డిపల్లె




రమాదేవి పత్రికా ప్రకటనలో తెలియచేసారు. ఈ ఉత్సవాలలో మఠం యొక్క ప్రముఖ శిష్యులు మాన్యశ్రీ గాలి కరుణాకర రెడ్డి , మాజీ మంత్రివర్యులు మాజీ పార్లమెంట్ సభ్యులు, కర్ణాటక సతీమణి శ్రీమతి వనజమ్మ విశిష్ట అతిధులుగా హాజరవుతున్నారనీ ఉదయం 8 గంటలకు పార్క్ వద్ద కోలాటం భజనలతో కార్యక్రమంకు అంకురార్పణ జరుగుతుందని శ్రీ కరుణాకర రెడ్డి శ్రీమతి వనజమ్మ గార్ల ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్న ప్రసాద సేవ భక్తులకు శిష్యులకు జరుపుతున్నామని, ఈ మహోత్సవంలో స్వామి వారి భక్తులు శిష్యులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కరుణా కటాక్షాలకు పాత్రులు కాగలరని ఈ ప్రకటనలో కోరారు.. మహిళా భక్తులకు అమ్మవారి పూజ గాజులు, పసుపు, కుంకుమలతో పాటుగా, జాకెట్ అమ్మవారి ప్రసాదంగా ఇస్తున్నట్టు శ్రీమతి రమాదేవి గారు చెప్పారు.

## ఇది ప్రజాస్వామ్య విజయం మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం వనజ గౌడ్....



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్): కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండల

కేంద్రంలో మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్ పి టి సి ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించడం ఇది ప్రజాస్వామ్య విజయమని ఆయన పేర్కొన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్ పి టి సి ఉప ఎన్నికల విజయం కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి మరియు ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా గెలుపొందిన పులివెందుల అభ్యర్థి లతా రెడ్డికి ఒంటిమిట్ట అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఆయన అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం వనజ గౌడ్ పాల్గొన్నారు.

## సిద్ధార్థలో ముగిసిన వాలీబాల్ పోటీలు




విజయవాడ, ఆగస్ట్ 14:( శుభోదయం న్యూస్( సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా విజయవాడలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ నెల 11న ప్రారంభమైన ఆలిండియా ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ నాలుగోరోజు కానూరులోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం ముగిశాయి. పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ తో పాటు సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీ.వీ.రావు సెమీఫైనల్, ఫైనల్ పోటీలు ప్రారంభించారు. వాలీబాల్ మహిళల విభాగంలో జరిగిన మొదటి సెమీఫైనల్లో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ చెన్నై జట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జట్టుపై 3–0 తేడాతో వరుస సెట్లలో సునాయాసంగా విజయం సాధించింది. మహిళల విభాగం రెండో సెమీ ఫైనల్లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పుణె జట్టు సెంట్రల్ రైల్వే, ముంబైపై 3–2 సెట్ల తేడాతో విజయం సాధించింది. పోటాపోటీగా జరిగిన పురుషుల విభాగం మొదటి సెమీఫైనల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా త్రివేండ్రం జట్టు బిషప్ మూర్ కళాశాల, కేరళ జట్టు పై 3–2 తేడాతో గెలిచింది. పురుషుల విభాగం రెండో సెమీఫైనల్లో ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయం, చెన్నై జట్టు లయోలా కాలేజీ, చెన్నై జట్టుపై విజయభేరి మోగించింది. మహిళల విభాగం ఫైనల్ మ్యాచ్ లో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ, చెన్నై విజేతగా నిలవగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పుణె ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ముఖ్య అతిథి బోడే ప్రసాద్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీ.వీ. రావు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) మాజీ ఛైర్మన్ అంకమ్మ చౌదరి, పీ.బీ. సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ బహుమతులు ప్రదానం చేశారు.

## అరాచకాన్ని తరిమి కొట్టిన పులివెందుల ప్రజలు భాస్కర్ ముదిరాజ్ సింగిల్ విండో ఛైర్మన్




తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): గడచిన 5 దశాబ్దాలుగా పులివెందుల పరిసర ప్రాంతాలలో ఆటవిక సంస్కృతిని ప్రవేశపెట్టి,భారత రాజ్యాంగాన్ని కాదని,తన తాత రాజారెడ్డి సృష్టించిన ప్రత్యేకమైన చట్టాలతో జగన్ రెడ్డి చేస్తున్న అరాచక చర్యలను పులివెందుల ప్రజలు నేడు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టారని తంగేళ్ళ పాలెం సింగిల్ విండో ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్ కొనియాడారు. ప్రజాస్వామ్యయుతంగా,స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి 6,033 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించడం, అలాగే ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్ల తేడాతో గెలిచి జగన్ ఇలాకాలో ప్రజాస్వామ్యానికి ఊపిరి పోశారని హర్షం వ్యక్తం చేశారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన బహుమతే పులివెందుల జెడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ఘనవిజయం అని, దీనితో పులివెందుల నియోజకవర్గంలో రాజారెడ్డి రాజ్యాంగం అంతం ప్రారంభమైంది అని తెలిపారు.గత ముప్పై ఏళ్లుగా పులివెందులలో జగన్ అరాచకం ఎలా రాజ్యమేలిందో ప్రజలందరికీ తెలుసునని, అక్కడ ఎప్పుడు ఎన్నిక జరిగినా ప్రత్యర్థులను నామినేషన్ వేయనివ్వకుండా అడ్డుకోవడం, ఒకవేళ పోలింగ్ అనివార్యమైనా ప్రజలను ఓటు వేయనిచ్చే వారు కాదని, ఇన్నాళ్లకు కూటమి ప్రభుత్వ పుణ్యమా అని పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు వేయడం, ఓటింగ్ జరగడం అనేది భారత రాజ్యాంగం సాధించిన విజయంగా చెప్పవచ్చు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం,శివ పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులతో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు .బృందావనాన్ని తలపించేలా పాఠశాల ఆవరణ అంతా అలంకరించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు మరియు గోపికల వేషధారణలో వచ్చి అందరిని అలరించారు.అద్భుతమైన అలంకరణతో శ్రీకృష్ణునికి పూజని నిర్వహించి, ప్రీ ప్రైమరీ విద్యార్థులతో ఉట్టిని కొట్టించారు.పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ఈ భూమిపైన తల్లి గర్భం నుంచి జన్మించి జీవించినటువంటి మహోన్నతుడు,అపార మేధావి, కర్తవ్యాన్ని బోధించే గురువు, నిత్య ఆరోగ్యంతో ఉండేందుకు సూచనలు చెప్పిన గొప్ప వైద్యుడు. శ్రీకృష్ణుడు మనకు నేర్పించిన ధర్మం ఏ మతానికి సంబంధించినది కాదు అది మానవ జీవితం అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎ.జి.ఎం సురేష్ గారు మాట్లాడుతూ మానవ మనుగడను నిర్దేశించే మార్గదర్శి అయినటువంటి భగవద్గీతను మనకు అందించినటువంటి గొప్ప మహనీయుడు శ్రీకృష్ణుడు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అమ్మాజీ, ఇన్చార్జులు కల్పన, వాసంతి, ఎ.ఓ.సురేష్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ గర్ తిరంగ్




చీరాల, శుభోదయం న్యూస్: 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ గర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి హిందూ చైతన్య వేదిక డాక్టర్ తాడివలస దేవరాజు ఓడరేవు బిజెపి నాయకులు మరియు మండల వైస్ ప్రెసిడెంట్ రాజేష్ ఆధ్వర్యంలో వాడరేవు సెంటర్ నందు ప్రతి ఇంటికి, షాప్ కి జాతీయ జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓడరేవు గ్రామ బిజెపి నాయకులు దామిశెట్టి శ్రీనివాస గుప్త, మున్నం శ్రీనివాస్ రెడ్డి, ఉల్లిసి సతీష్, గుణిమిని శివ కోటి రెడ్డి ,వెంకటేశ్వర రెడ్డి, మండల బీజేపీ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ వైష్ణవ్, కోకి ఏడుకొండలు, మున్నం కల్యాణ్ చక్రవర్తి రెడ్డి, అక్కల శ్రీనివాస్ రెడ్డి, పెంకి సత్య బాబు, కోట శ్రీను, సున్నపు జగన్, మూర్తి జొన్న, వంశీ కృష్ణ రెడ్డి, ధనుంజయ రెడ్డి, ఓడరేవు టిడిపి నాయకులు, మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాలు పిల్లలకు, ఇంటింటికి పంపిణీ





చీరాల, శుభోదయం న్యూస్: హిందూ చైతన్య వేదిక చీరాల నియోజకవర్గ ప్రముఖ డాక్టర్ దేవరాజు ఆధ్వర్యంలో నూతన వధూవరులు వల్లూరి రాజు, మణి హర్షిత చేతులు మీదగా ప్రసాద నగరంలో జాతీయ జెండాల పిల్లలకు మరియు ఇంటింటికి పంపిణీ కార్యక్రమను నిర్వహించారు.

## ఎగువ గువ్వలపల్లి వాసికి .. అరుదైన గౌరవం!

కేంద్ర ప్రభుత్వ పోలీస్ శాఖలో

అత్యుత్తమ అవార్డు అందుకున్న చిటిమిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి!



ఆమడగూరు మండలం, (శుభోదయం న్యూస్): ఆమడగూరు మండలంలోని ఎగువ గువ్వలపల్లి గ్రామానికి చెందిన సామాన్య రైతు కుటుంబానికి చెందిన చిటిమిరెడ్డి అశ్వర్థ రెడ్డి కుమారుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ రెడ్డికి కేంద్ర ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించింది. చిట్టిమిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి దేశ రక్షణ కోసం యుక్త వయసులోనే మిలటరీ చేరి 30 సంవత్సరాలుగా దేశం కోసం, ప్రజల కోసం విశేష సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం సిబీ ఐ అధికారిగా పదోన్నతులు కల్పించింది. సిబిఐ అధికారిగా అత్యుత్తమ సేవలను అందించినందుకు కేంద్ర ప్రభుత్వం గౌరవప్రదమైన అవార్డు 2025 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అరుదైన సత్కారం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సిబిఐ అధికారి చిట్టిమిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో సంవత్సరాలు మిలిటరీలో పని చేశానన్నారు. నా సేవలను గుర్తించి సిబిఐ అధికారిగా కర్ణాటకలోని బెంగళూరులో విధులు నిర్వహిస్తున్నారు. నా సేవలను గుర్తించి ఉత్తమ పోలీస్ అధికారిగా భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డును దేశ ప్రజలకు , పుట్టిన ప్రాంతానికి అంకితం చేస్తున్నానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో దేశ సమగ్రతకు, ప్రజల రక్షణకు పాటుపడతానని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ అరుదైన గౌరవం కేంద్ర ప్రభుత్వానికి, నా తోటి సిబ్బందికి , దేశ ప్రజలకు, నేను పుట్టిన ప్రాంతానికి , దేశభక్తులకు, పలువురికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి!



శుభోదయం న్యూస్: భారత స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 న మన భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ




విద్యార్థులతో కలిసి జూనియర్ కళాశాల నుంచి పురువీదుల గుండా జాతీయ జెండాలు చేత బూని వందేమాతరం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో విద్యార్థులతో కలిసి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నారని ప్రతి ఒక్క విద్యార్థి, దేశ పౌరుడు దేశం పట్ల భక్తి భావంతో మెలగాలన్నారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు దేశంపై భక్తి భావంతో స్వాతంత్ర సమరయోధులను నిత్యం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో ముందుకు వెళ్లాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాజూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా “హర్ ఘర్ తిరంగా” ర్యాలీ కోలా ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్




శ్రీకాళహస్తి రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): ఆగష్టు “13 నుంచి 15 వరకు” తిరంగా ర్యాలీ మరియు ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేద్దాం – మన దేశ ఐక్యతను చాటుకుందాం అనే నినాదంతో జాతీయ జెండాను ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరి గుండెకు చేరే విధంగా మువ్వన్నెల జెండాలను భారీగా




చేత పట్టుకొని పురవీధుల్లో త్రివర్ణమయంతో భారత్ మాతా కీ జై, జై జై మాతా భారత్ మాతా అంటూ వందే మాతరం అనే నినాదాలుతో కోలాహలంగా మువ్వన్నెల జెండాలు ఊపుతూ, అంగరంగ వైభవంగా అంబరాన్ని అంటే విధంగా మువ్వన్నెల జెండాలతో హర్ ఘర్ తిరంగా – ఘర్ ఘర్ తిరంగా అంటూ ర్యాలీ యాత్ర భారీ ఎత్తున నిర్వహించడం జరిగినది.భారతీయ జనతా పార్టీ సూచనలు మేరకు తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగినది.తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ అతిధిగా పాల్గొని,రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ మరియు తిరుపతి జిల్లా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల కమిటీ కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, బి.జె.పి. పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులు, స్కూలు, కాలేజీ విద్యార్థి,విద్యార్థినుల నడుమ అత్యంత వైభవంగా ఘనంగా భారీసంఖ్యతో “హర్ ఘర్ తిరంగా “ ర్యాలీ కార్యక్రమం జరిగింది.

## యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం :2వ పట్టణ సిఐ నాగార్జున రెడ్డి



శ్రీకాళహస్తి రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ ఆదేశాలతో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తి 2 వ పట్టణ సి.ఐ నాగార్జున రెడ్డి భాస్కరపేటలోని మునిసిపల్ హై స్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్ యాక్ట్, ర్యాగింగ్ చేయడం వలన జరిగే నష్టాలు ఎదుర్కొనే శిక్షలు గురించి వివరించారు. ట్రాఫిక్ రూల్స్, ఫోక్సో చట్టం గురించి తెలియజేశారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు లోను కావద్దని, డ్రగ్స్ తీసుకున్న వారు చేసే నేరాలు సంబంధిత శిక్షలు గురించి తెలియ చేశారు. సైబర్ క్రైమ్ గురించి వివరించి లోన్ యాప్స్,బెట్టింగ్ యాప్స్ వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. అంతే కాకుండా సోషల్ మీడియా గురించి జాగ్రత్తగా ఉండమని, ఇంస్టాగ్రామ్ వాట్సాప్ లో వచ్చే యాప్ లింక్స్ డౌన్లోడ్ చేసుకోవద్దని చెప్పడమైనది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ని పరామర్శించిన... నేదురుమల్లి



వెంకటగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ – వీసీ.సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా వెంకటగిరి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సతీమణి , డక్కిలి మండల జడ్పిటిసి సభ్యురాలు శ్రీమతి కలిమిలి రాజేశ్వరి గతవారం మరణించడం తో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురమల్లి రామ్ కుమార్ రెడ్డి కలిమిలి నీవాసంకి వెళ్లి రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. వారి వెంట ప్రముఖ బిసి నేత బొలింగల మస్తాన్ యాదవ్ మండల నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు ఉన్నారు.

## పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడంపై సంబరాలు.



శుభోదయం న్యూస్: జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో పులివెందుల, ఒంటిమిట్ట నందు కూటమి అభ్యర్థులు గెలుపొండంతో డోన్ పట్టణంలో ఎం ఎస్ ఆర్ ఆఫీస్ నందు పులివెందుల ఎన్నికల ఇంఛార్జ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి కూటమి నాయకులు,



కార్యకర్తలతో కలిసి పులివెందుల, ఒంటిమిట్ట లో గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు , గెలుపొందిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపుతూ... బాణా సంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి, అడ్వకేట్ ఆలా మల్లిఖార్జున రెడ్డి, డోన్ పట్టణ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్, డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటి కేబుల్ కిరణ్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పామూరు పట్టణంలో 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న యారవ,ఉప్పలపాటి, పందిటి, కొండిశెట్టి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమంలో పామూరు టౌన్ లో బీజేపీ పామూరు మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను గారి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు పందిటి హరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి



భారతీయుడి ఇంటి మీద జాతీయ పతాకం ఎగరవేయాలి. ఇది కేవలం ఒక ఆచారం కాదు, దేశం పట్ల ఉన్న ప్రేమను, గౌరవాన్ని చూపించే గొప్ప అవకాశం. జాతీయ పతాకం మన స్వేచ్ఛా సమరయోధుల రక్తం, చెమట, త్యాగాలతో నిండి ఉంది. కాషాయ రంగు మనకు ధైర్యం, త్యాగం నేర్పుతుందిబీ తెలుపు రంగు శాంతి, సత్యం మార్గంలో నడిపిస్తుందిబీ ఆకుపచ్చ రంగు వికాసం, సమృద్ధిని సూచిస్తుంది. మధ్యలోని అశోక చక్రం మనం ఎప్పుడూ ముందుకు కదిలి, న్యాయం మరియు సమానత్వం కోసం శ్రమించాలి అని చెబుతుంది. స్వాతంత్ర్యం కోసం కోట్లాది మంది ప్రాణాలు అర్పించారు. భగత్ సింగ్, సుభాష్ చంద్ర బోస్, మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు వంటి మహానుభావులు కేవలం జెండా ఎగరేయడమే కాదు, దానికి గౌరవం నిలుపుకునేందుకు తమ ప్రాణాలర్పించారు. ఈరోజు మన బాధ్యత %-% వారి కలల భారతాన్ని నిర్మించడం. దేశాన్ని ప్రేమించడం అంటే కేవలం జాతీయ పండుగలలో మాత్రమే కాకుండా, ప్రతి రోజూ మన పనుల్లో, మన ప్రవర్తనలో చూపించాలి. ఈ కార్యక్రమంలో యారవ శ్రీనివాసులు, ఉప్పలపాటి హరిబాబు, కొండిశెట్టి రమణయ్య, పాలపర్తి రమణయ్య, నర్సింగ్ సాంబయ్య, కావేరి రసూల్, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి కుమారుడు వివాహ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులు ఇర్రి కృష్ణారెడ్డి.





పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి వివాహ వేడుకలు అనంతపురంలోని జి ఎం ఆర్ గ్రౌండ్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రణయ్ రెడ్డి దంపతులను వైఎస్ఆర్సిపి నాయకులు ఇర్రి కృష్ణారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు తదుపరి వైఎస్ఆర్సిపి నాయకురాలు మాజీ మంత్రివర్యులు ఆర్కే రోజా ను మర్యాదపూర్వకంగా కలిసిన కొంచెం సేపు ముచ్చటించారు.

## మన్నెపల్లి వారి గృహప్రవేశ వేడుకలో కదిరి పార్థసారథి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్ పురం ఎంపిటిసి మన్నెపల్లి సుబ్బమ్మ పెద్దన్న గారి నూతన గృహప్రవేశం గురువారం జరిగింది. ఈ



గృహప్రవేశ వేడుకలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పాల్గొని మన్నెపల్లి పెద్దన్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రైతులతో స్వయంగా ట్రాక్టర్ నడిపిన ఎలక్షన్ బాబు



ఎర్రగొండపాలెం మండల రిపోర్టర్ నారాయణ (శుభోదయం న్యూస్): సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద



మొదటి విడతగా ఏడువేలు రైతుల ఖాతాలో జమ అయిన సందర్భంగా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత సంబరాలు కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ రైతుల తరపున ధన్యవాదములు తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలోని బంగ్లా నుండి వినుకొండ రోడ్డులోని ఏఎంసి కార్యాలయం వరకు వందలాది ట్రాక్టర్ లతో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎంసి కార్యాలయంలో అన్నదాత సంబరాల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఎరిక్షన్ బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు ఐదు మండలాల టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## నషా ముక్తు భారత్ అభియాన్ ప్రోగ్రాం



దోర్నాల మండలం రిపోర్టర్ ఆవులయ్య శుభోదయం న్యూస్ : ప్రకాశం జిల్లాదోర్నాల మండల గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో నషా ముక్తు భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి గారు అధ్యక్షత వహించారు .ఈ



కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ పి. హబీబ్ ఖాన్ గారు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం ,గంజాయి, డ్రగ్స్ వలన యువత మీద చాలా ప్రభావం చూపిస్తున్నాయి వీటిని తీసుకోవడం వలన విద్యకు దూరమవ్వటం, ఆరోగ్యాలు చెడిపోవడం, కుటుంబ వ్యవస్థలు నాశనం అవ్వటం, సమాజంలో గౌరవం లేకపోవడం వంటివి జరుగుతున్నాయి. కావున వీటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అనంతలక్ష్మి, %ూచీవీ% నాగలక్ష్మి, ఆశా వర్కర్స్, లెక్చరర్లు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చినారుట్లకు. కరెంటు సప్లై చేయాలి చెంచు గిరిజనుల ప్రాణాలు కాపాడాలి



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య ( శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పరిధిలో చినారుట్ల గూడెం కు కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం వచ్చారు ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో. కరెంటు కోసం అధికారులకు చెంచులు ఎన్నిసార్లు వారు విన్నవించుకున్నప్పటికీకరెంటులేకపోవడంతో. వన్నె మృగాలు. అడవిలో ఆహారం లేకపోవడంతో. చెంచుల గొర్రెలు మేకలు. చిన్నపిల్లలను దాడి చేస్తూ వచ్చాయి దీనికి ప్రధానమైన కారణం గ్రామంలో కరెంటు లేకపోవడంతో. చెంచు గిరిజనులు బిక్కుబిక్కుమని ప్రాణాలు చేతులు పెట్టుకొని బ్రతుకుతున్నారు. అయితే నిన్న రాత్రి చిన్నారుట్ల లోచెంచు గిరిజన గూడెంలో గత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గూడెంలోని కుడుముల అంజయ్య , రాజేశ్వరి మూడు సంవత్సరాల చిన్న పాపతో నిద్రిస్తున్న సమయంలో చిరుత పులి చిన్నారి తలను నోటితో పట్టుకొని లాక్కొని వెళ్తున్న సమయంలో తండ్రి అంజయ్యకు మేలుకోరాటంతో అప్రమత్తమైన అంజయ్య వెంటనే పెద్దగా కేకలు వేయగా పాపను చిరుత వదిలి వెళ్ళిపోయింది. పాపకు తల, మెడ భాగాల్లో గాయాలు కావడంతో సుండి పెంట ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకొని వెళ్లి వైద్యం అందించడం జరిగింది .అయితే గత వారం రోజుల నుండి రాత్రి సమయంలో గూడెంలో చిరుత పులి సంచరిస్తుందని మేకలను, కోళ్లను, ఆవు దూడలను ఎత్తుకెళ్లిపోతుందని గూడెం వారు తెలిపారు కావున అధికారులు దయవుంచి చిన్నారుట్ల గ్రామంలో కరెంటు సప్లై చేయవలసిందిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన. సంఘంసంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కుడుముల వెంకటేశం. గంగయ్య. టీటీడీపి ప్రెసిడెంట్ గురవయ్య పాల్గొన్నారు

## 79వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): 79వ స్వతంత్ర దినోత్సవానికి సన్నద్ధమైన పట్టణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన పామూరు ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్. ఎందరో మహనీయులు త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వతంత్ర ప్రజాస్వామ్యం సాధన మన దేశం. మువ్వన్నెల జెండా జరగవరోహంగా రెపరెపలాడుతుంది అంటే ఆ త్యాగ ధనుల ఆత్మ అర్పణ ఫలితమే దేశం ఐక్యత శాంతి సౌభాగ్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని ఆయన అన్నారు.





## 79వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు గంగసాని

పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండల వైఎస్ఆర్సిపి నాయకులకు మరియు కార్యకర్తలకు 79వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి తదుపరి వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ప్రాంగణంలో 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు మరియు జండా ఆవిష్కరణ జరుగును అని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన అన్నారు.



## 79వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పువ్వాడి

పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండల కూటమి నాయకులు కార్యకర్తలకు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో మహానుభావుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకుంటూ 79వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు. తదుపరి పంచాయితీ కార్యాలయం ఆవరణంలో 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు మరియు జండా ఆవిష్కరణ జరుగును అని కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన అన్నారు.

## దుగ్గిరెడ్డి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఆకుపాటి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): మాజీ నారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ దుగ్గిరెడ్డి జైరెడ్డి కుమారుడు నితీష్ రెడ్డి వివాహ వేడుకల్లో ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బోయిన రాయుడు, మన్నేపల్లి రవికుమార్, దర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## చెరుకుపల్లి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ బోయళ్ల



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్పురం మండలం ఉప్పలపాడు గ్రామం లోని చెరుకుపల్లి వెంకటేశ్వర రెడ్డి కుమార్తె అలేఖ్య వివాహ వేడుకల కార్యక్రమంలో మాజీ సింగల్ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, పోకల మాలకొండయ్య, సంగిశెట్టి పీరయ్య నాయుడు, ఎస్ డి రెహమాన్, బిటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సంబరాలు చేసుకున్న కూటమి నాయకులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహరెడ్డి అదేశాలమేరకు!పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో యన్.డి.ఏ కూటమి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా స్థానిక మమ్మీ డాడీ సెంటర్లలో స్వీట్లు పంపిణీ, బాణసంచా కాల్చి హర్షం వ్యక్తపరిచారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమ శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర నాయకులు కోండిశెట్టి రమణయ్య, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, వై.రహిముల్లా, కనిగిరి నియోజకవర్గ వాణిద్య విభాగ అధ్యక్షులు పందిటి హరీష్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మెంట నరసింహారావు ,మాజీ





పట్టణ అధ్యక్షులు ఖజా రంతుల్లా, తడికమల్ల సుబ్బారావు, కావేరి రసూల్, పాలపర్తి రమణయ్య, నర్సింగ్ సాంబయ్య, మన్నం రమణయ్య, మొబీనా మౌలాలి, నాయిబ్ రసూల్, తోట రవికుమార్, నొస్సం నాగేంద్రా చారి, ఆర్ఆర్ రఫీ, కొండా నరసింహులు, మరియు తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ, బిజెపి పార్టీ నాయకులు, శ్రేణులు,మహిళ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగాబోల్ల నరసింహారావును కలిసిన సచివాలయం సిబ్బంది



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండలం లక్ష్మి నర్సాపురం ఎంపీటీసీ యువ నాయకులు బొల్ల నరసింహారావును లక్ష్మి నరసాపురం సచివాలయం సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

# డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీ




పాపన్నపేట, ఆగస్టు 14 శుభోదయం న్యూస్ (మల్లొడ్డికృష్ణ): ఆగస్టు 15 శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా ముందు రోజు గురువారం పాపన్నపేటలో పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పలు దుకాణాలలో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,సిబ్బంది ఉన్నారు.

## దళితగ్రామంపై దాడిచేసినాపాలకులు స్పందించరా?



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: ఒకదళితగ్రామంపై ఒకసామాజిక వర్గానికిచెందిన 50మంది మారణాయుధాల తోమూకుమ్మడి దాడిచేస్తే పాలకులకుపట్టదా?అని కావలిమాజీ శాసనసభ్యుడు రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డి ప్రశ్నించాడు.ఇటీవలబోగోలు మండలంతెల్లగ ుంటదళితకాలనీ పై అదేమండలానికిచెందిన సిద్ధవరం బీసీ సామాజికవర్గానికి చెందినవ్యక్తులు దాడిచేయడంపై దళితవాడబాదితులను గురువారంరాత్రి ఆయన పరామర్శించాడు. మేజర్లైన ఇద్దరూయువతీయువకులుప్రేమ వివాహంచేసుకుని,సాక్షాత్తుజిల్లా ఎస్పీసమక్షంలో మేజర్లైనతాము ఇష్టపూర్వకంగాపెళ్లి చేసుకున్నామని,రాతపూర్వకంగా తెలియపరచినప్పటికీ,దళితులపై దాడిచేయడంహేయమైనచర్య అన్నారు.ఇంతజరుగుతున్నా పోలీసులునిందితులనుఅరెస్టు చేయకుండాహైడ్రామాచేయడం, పాలకులుసైతంబాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. వైకాపా దళితసంఘాల నాయకుడుకామరాజు మాట్లాడుతూ దళితగ్రామానికి వైకాపాపార్టీ అండగాఉంటుందని, అవసరమైతే ప్రైవేటుకేసులు పెట్టడానికైనా వెనకాడ బోమన్నారు. పైకార్యక్రమంలో బోగోలుమండల వైకాపా అధ్యక్షుడుమద్దిబోయిన వీరరఘు, ఎంపీటీసీసభ్యుడుసుందరరాజు, పలువురువైకాపానాయకులు,గ్రామప్రజలు, తదితరులుఉన్నారు

# శ్రీ సరస్వతి విద్యా మందిరంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు






తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ శ్రీ సరస్వతి విద్యా మందిరంలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణం పూలతో, రంగవల్లులతో అలంకరించబడింది. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. కోలాట భజన, కీర్తనలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వెన్నల కుండలతో ఆటపాటలు నిర్వహించగా, ఉపాధ్యాయులు పిల్లలకు శ్రీకృష్ణుడి బాల్యచరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పీజీ నరేష్, చైర్మన్ సనత్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురైన వైసీపీ కార్యకర్తను పరామర్శించిన పూల శ్రీనివాస్ రెడ్డి



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): ముదిగుబ్బ మండలం,పొడరల్ల పల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కిరణ్ కుమార్ పాము కాటుకు గురై రికవర్ అయి ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం తదితర విషయాలను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న తేదేపా నాయకులు





నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, ఆగస్ట్ 14(శుభోదయం న్యూస్) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రైతులతో ఘనంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల తెదేపా కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల తెదేపా నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కదిరి పట్టణంలోని పివిఆర్ గ్రాండ్ నుండి కదిరి పట్టణంలోకి ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు.

## పొట్టిపాడు సొసైటీ చైర్మన్ గా అట్లూరి నానిని నియమించిన యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ఉంగుటూరు మండలం పొట్టిపాడు సొసైటీ బ్యాంక్ చైర్మన్ గా అట్లూరి జోషి మధు (నాని )... డైరెక్టర్ గా నిమ్మకూరి మాణిక్యాల రావు , చొప్పర శ్రీరామ తులసి నియమించినందుకు గౌ " గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సన్మానించి కృతజ్ఞతలు చెప్పి మాకు ఇచ్చిన ఈ బాధ్యతను న్యాయంగా నిజాయితీగా నిర్వహిస్తామని తెలియజేశాము. మీ మార్గదర్శకతతో ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం . మీ ఆశీస్సులు మాకు తోడుగా ఉండాలని కోరుకుంటున్నాము.

# భక్తిమార్గంఆచరణీయం యలమంచిలిబాబూరాజేంద్ర ప్రసాద్



ఉయ్యూరు (శుభోదయం న్యూస్) ఉయ్యూరు పట్టణం 4వ వార్డు రాజేంద్ర నగర్ ఏర్పాటు చేసిన శ్రీ విద్యా గణపతి అభీష్ట సిద్ద అభయాంజనేయ స్వామి బాల మురుగన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమా ఈ సంద్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాజేంద్ర నగర్ కాలనీ అనేక కులాల మతాల సమ్మేళనం అని ఇక్కడి ప్రజలు నా కుటుంబ సభ్యులు అని ఒకే కాలనీ లో చర్చ్ మజీద్ హిందూ దేవాలయం కలిగి ఉండటం అభినందనీయమని ఈ రాష్ట్రం ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు



ఆధ్వర్యం అభివృద్ధి చెందాలని ఉయ్యూరు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని కోరుకుంటు నాను అని భక్తి మార్గం అనుచరణీయమని తెలిపారు ఈ సంద్భంగాఆలయ కమిటీ పెద్దలు యువకులు రాజేంద్రప్రసాద్ ని సన్మానించారు ఈ కార్త్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ ఆలయ కమిటీ పెద్దలు.కన్నెబోయిన నాగరాజు ,పిరిడి రవి కుమార్,ఉల్లి సాంభశివరావు,కోవగని సత్యం,కొవగని రాము,లావేటి రాము,పరిసే గంగాధర్, బూరాబతుల్ల శ్రీను ,హాస్టల్ శ్రీను యువకులు పాల్గొన్నారు

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనున్న: ఎమ్మెల్యే కోట్ల



నంద్యాల ప్రతినిధి - సుధాకర్(శుభోదయం న్యూస్):డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 8:30 నిమిషాలకు డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 9 గంటలకు డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. మరియు సాయంత్రం 4 గంటలకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్సామీల్లో ఒకటైన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని డోన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించుచున్నారు.కావున టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## సాయిలీల హైకింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్ కు భారీ జరిమానా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్ నిర్వాహకులు



రామగుండం మండలం, రిపోర్టర్ -(శుభోదయం న్యూస్): నాణ్యత లేని ఆహార పదార్థాలు వడ్డిస్తున్న సాయిలీల రెసిడెన్సీ %డ% హైకింగ్ ఫామిలీ రెస్టారెంట్ కు గురువారం రామగుండం నగర పాలక



సంస్థ పదివేల రూపాయల జరిమానా విధించింది..తనకు వడ్డించిన ఆహారం నాణ్య%శీ%గా లేదని ఒక వినియోగదారుడు నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ కి గురువారం సాయంత్రం ఫోన్ ద్వారా సందేశం పంపించడంతో స్పందించిన ఆమె వెంటనే తనిఖీ చేయవలసిందిగా నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీకి వెళ్లిన నగర పాలక సంస్థ అధికారులు అక్కడ నాణ్య%శీ%గా లేని ఆహార పదార్థాలు గుర్తించి జరిమానా విధించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, సంపత్ , ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు ఈ తనిఖీలు నిర్వహించారు.

## మన్నేపల్లి వారి నూతన గృహప్రవేశ వేడుకకు హాజరైన బూచేపల్లి, దద్దాల



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సీయస్ పురం టౌన్ లో ఎంపీటీసీ మన్నేపల్లి పెద్దన్న గారి నూతన గృహప్రవేశ వేడుకకు ముఖ్య అతిధులుగా వైయస్సార్సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మరియు కనిగిరి నియోజకవర్గం వైయస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్నేపల్లి పెద్దన్న దంపతులకు మరియు వారి కుటుంబ సభ్యులలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి మీ కొత్త ఇంటిలో మీకు సంతోషం,ఆనందం, శాంతి,శ్రేయస్సు చేకూరాలని ఆశీర్వదించారు.గృహప్రవేశం కార్యక్రమానికి విచ్చేసిన



సందర్భంగా ఇరువురిని దుశ్శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ గృహప్రవేశం వేడుకలో పాలగుల్ల మల్లికార్జున్ రెడ్డి,మేకల శ్రీనివాసులు,గుంటగ తిరుపతి రెడ్డి,మడతల కస్తూరి రెడ్డి , గంగసాని హుస్సేన్ రెడ్డి, చప్పిడి సుబ్బయ్య,ఓకే రెడ్డి,భువనగిరి వెంకటయ్య , ఇండ్ల బాలయ్య ,కల్లూరి రామిరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి,చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు చౌదరి, భూమిరెడ్డి వెంకటరెడ్డి,సూరసానిమోహన్ రెడ్డి, మితికాల గురవయ్య, గట్ల విజయభాస్కర్ రెడ్డి,తమ్మనేని సుజాత, గోపవరపు బొర్రారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి,వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి, కటికల వెంకటరత్నం,సైకం ఏడుకొండలు రెడ్డి, నాగమణి, షకీలా, భాను, సుస్మిత,గోడి నారాయణరెడ్డి, గోన దానయ్య, మిట్ట రమేష్ రెడ్డి, పాత కొట్టు పిచ్చిరెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, యేలిక బుజ్జి, అంబాల శేఖర్ రెడ్డి, మొరం మురార్జీ, దుద్దుకూరు శ్రీనివాస్, ఆసం బాల్రెడ్డి,సూర్యనారాయణ రెడ్డి, ముడమాల నారాయణరెడ్డి, బత్తుల దేవరాజు, షేక్ బుజ్జి, ఈర్ల వీరాంజనేయులు, సిద్దు వెంకటరెడ్డి, సిద్దు రమణారెడ్డి,తమ్మిశెట్టి అంకబాబు, సంగిశెట్టి వాసు, సన్నపురెడ్డి ప్రకాశ్ రెడ్డి, అద్దంకి రమణయ్య, పందిటి వెంగళరావు, ఎంబడి ప్రవీణ్, పులి రామచంద్రారెడ్డి, పాలగుళ్ల రత్నారెడ్డి, బొర్రాజు రమణయ్య, అటేలయ్య, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిరెడ్డి వారి కళ్యాణ వేడుకలో పాల్గొన్న బూచేపల్లి, దద్దాల



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సీయస్ పురం మండలం కోవిలంపాడు గ్రామంలో శ్రీ నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, వైయస్సార్సీపీ నాయకులు దుగ్గిరెడ్డి జయరెడ్డి - శివలక్ష్మి గార్ల కుమారుడు నితిన్ రెడ్డి వెడ్స్ నితిన్ రెడ్డి అఖిల రెడ్డి కళ్యాణ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి,వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గారు మరియు కనిగిరి వైయస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్. ఈ కార్యక్రమంలో పాలగుల్ల మల్లికార్జున్ రెడ్డి, మేకల శ్రీనివాసులు,గుంటగ తిరుపతి రెడ్డి,మడతల కస్తూరి రెడ్డి,గంగసాని హుస్సేన్ రెడ్డి, చప్పిడి సుబ్బయ్య,వైఎం ప్రసాద్ రెడ్డి,ఓకే రెడ్డి, భువనగిరి వెంకటయ్య ,కల్లూరి రామిరెడ్డి,ఇండ్ల బాలయ్య, ముత్యాల నారాయణరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి,చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, కదిరి పార్థసారధి,మిరియం వెంకటేశ్వర్లు చౌదరి, భూమిరెడ్డి వెంకటరెడ్డి,సూరసానిమోహన్ రెడ్డి, మితికాల గురవయ్య, గట్ల విజయభాస్కర్ రెడ్డి,తమ్మనేని సుజాత, గోపవరపు బొర్రారెడ్డి, శిరుప గోవర్దన్ రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి, కటికల వెంకటరత్నం,సైకం ఏడుకొండలు రెడ్డి, పాత కొట్టు పిచ్చిరెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, కందుల శ్రీనివాసుల రెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, షేక్ నాయబ్ రసూల్,యేలిక బుజ్జి, అంబాల శేఖర్ రెడ్డి, మొరం మురార్జీ, దుద్దుకూరు శ్రీనివాస్, ఆసం బాల్రెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, సూర్యనారాయణ రెడ్డి, ముడమాల నారాయణరెడ్డి, బసవి శేఖర్, బత్తుల దేవరాజు, షేక్ బుజ్జి, ఈర్ల వీరాంజనేయులు, సిద్దు వెంకటరెడ్డి, సిద్దు రమణారెడ్డి,తమ్మిశెట్టి అంకబాబు, సంగిశెట్టి వాసు, సన్నపురెడ్డి ప్రకాశ్ రెడ్డి, అద్దంకి రమణయ్య, పందిటి వెంగళరావు, ఎంబడి ప్రవీణ్, పులి రామచంద్రారెడ్డి, పాలగుళ్ల రత్నారెడ్డి, బొర్రాజు రమణయ్య, అటేలయ్య, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాఎస్.పి ని మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజెఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు




మెదక్ జిల్లా, శుభోదయం న్యూస్: మెదక్ జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ పి డి. వి. శ్రీనివాసరావును టీ.వై.జె.ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు మర్యాదపూర్వకంగా కలిసిన టీ వై జె ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు.ఇటీవల కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహించి గత రెండు నెలల క్రితం మెదక్ జిల్లాకు బదిలీపై వచ్చిన డి.వి. శ్రీనివాసరావు ఐపిఎస్, ను టీ.వై.జె.ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నాగరాజు చారి ఆధ్వర్యంలో గురువారం రోజు ఎస్ పి కార్యాలయంలో టీ.వై.జె.ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... గత రెండు నెలల క్రితం బదిలీపై మెదక్ జిల్లా కి వచ్చిన ఎస్ పి శ్రీనివాస్ రావు ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన వరుస హత్య కేసులను సవాల్ గా తీసుకొని అతి తక్కువ సమయంలో కేసులను ఛేదించడం జిల్లా పోలీస్ యంత్రాంగానికి, మెదక్ జిల్లా వాసులకు గర్వించదగ్గ విషయం అన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడడంతో జిల్లా ప్రజలంతా ఎస్ పి శ్రీనివాసరావుని, పోలీస్ యంత్రాంగాన్ని అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ నాయకులు భరత్ గౌడ్, ఆకుల యాదగిరి, శ్రీశైలం, జమీర్, ప్రవీణ, యాదగిరి గౌడ్, సంద్రు శ్రీశైలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అరెస్ట్.. మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్.



**హైదరాబాద్, :** బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా ఇతర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచినందుకు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి, వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్భందించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని తెలిపారు. పోడు రైతులను వేధించడం ఆపి, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని.. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తో సహా బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని ఫైర్ అయ్యారు. దిందా పోడు రైతులను అరెస్ట్ చేసి తరలిస్తుండగా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ టీకి తరలించారు. అక్కడి నుంచి కౌటాలకు తరలిస్తుండగా పోలీసుల వాహనాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కౌటల వైపు తీసుకెళ్లినట్లు సమాచారం.

## రాజకీయం ఎలా చేయాలో కూడా తెలియని వ్యక్తి జగన్



**అమరావతి,:** గత 30 ఏళ్లలో కడపలో ఎక్కడైనా స్వచ్ఛందంగా ఓటు వేసే పరిస్థితి లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కనీసం నామినేషన్ కూడా వేసే పరిస్థితి లేకండా జగన్ మోహన్ రెడ్డి రూల్ చేశాడు.. కానీ ప్రస్తుతం ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా బయటకు వచ్చి ఓటు వేశారు.. ప్రజాస్వామ్యం రుచి చూసారు.. ఒక్క రాష్ట్రమే కాదు.. పులివెందుల, ఒంటిమిట్ట కూడా కూటమి వైపు ఉన్నాయని ఈ విజయం ద్వారా తెలుస్తుంది.. ఆరు వేల ఓట్లతో పులివెందుల జెడ్పీటీసీ మెజారిటీతో కైవసం చేసుకున్నాం.. కూటమి ప్రభుత్వాన్ని పులివెందుల ప్రజలు స్వాగతం పలికారు.. వైసీపీకి కనీసం డిపాజిట్ రాలేదు అని ఎద్దేవా చేసింది. ప్రజాస్వామ్యాన్ని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని నమ్ముకున్న వారి ఎవరు నష్టపోలేదు.. రాజా రెడ్డి రాజ్యాంగాన్ని నమ్ముకుని జగన్ మోహన్ రెడ్డి 151 సీట్లు నుంచి 11 సీట్లుకి పడిపోయారని ఆరోపించింది. పోలింగ్ బూత్ లు మార్చమని గోల చేశారు.. మార్చడం అనేది ఎన్నికల సంఘం చేతిలో ఉంటుంది.. గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసులను వారి సొంత పనులకు వాడుకున్నారు.. పోలీసులను గౌరవంగా పని చేసుకునే పరిస్థితి లేదని వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇక, తాడేపల్లి నుంచి ఒక స్క్రిప్ట్ వస్తుంది.. ఆ స్క్రిప్ట్ ను వైసీపీ వాళ్ళు అమలు చేస్తున్నారని మంత్రి అనిత తెలిపింది. సొంత పార్టీకి చెందిన పేర్ని నాని తప్పుగా మాట్లాడితే ఖండించలేదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వడం లేదు.. మాకు ఒక సంస్కారం ఉంది.. వైసీపీలా నోటికి వచ్చినట్టు మాట్లాడడం సరికాదు.. జగన్ 30 ఏళ్ళ సీఎం అని చెప్పుకుని 11 సీట్లకు పడిపోయారు.. కానీ, చంద్రబాబు రోజుకు 18 గంటల పాటు పని చేస్తున్నారని పేర్కొనింది. చంద్రబాబును టచ్ చేయకూడదు.. ఆ రోజు టచ్ చేశావ్ జగన్.. ఈ రోజు నీకు ప్రతిపక్షం కూడా లేదని తెలిపింది. సంస్కారం లేని వాళ్ళ గురించి మేము మాట్లాడాం.. పులివెందులకు, కడపకు నీళ్ళు ఇచ్చిన ఘటన ఒక్క చంద్రబాబుదే.. నెలకు నాలుగు రోజుల మాత్రమే జగన్ ఏపీకి వస్తాడని మంత్రి వంగలపూడి అనిత చెప్పుకొచ్చింది. అయితే, రాజకీయం ఎలా చేయాలో కూడా తెలియని వ్యక్తి జగన్ అని వంగలపూడి అనిత పేర్కొనింది. విలువలతో కూడిన రాజకీయాలు చేయ్.. మేము కూడా స్వాగతిస్తామన్నారు. పోలీస్ ఉద్యోగాలు తీయడానికి ఆయన ఎవరు.. నిత్యం ఖాకీ చొక్కా వేసుకుని వాళ్ళ ఉద్యోగం వాళ్ళు చేస్తున్నారు.. గత ఐదేళ్లు పోలీస్ శాఖతో ఊడిగం చేయించుకున్నాడు.. ప్రతి పనికి పోలీసులను వాడుకున్నాడు.. చంద్రబాబు పాలనలో పని చేసిన ఏ ఒక్క ఉద్యోగి కూడా జైలుకు వెళ్లలేదు.. కానీ, జగన్ ప్రభుత్వంలో పని చేసిన ఉద్యోగులు జైలుకు వెళ్లారని సెటైర్లు వేసింది. ఇదే చంద్రబాబు పాలనకు నిదర్శనం.. బాధ్యతగా పని చేయాల్సిన అవసరం మా మీద ఉంది.. లా అండ్ ఆర్డర్ విషయంలో దేశంలో ఏపీ రెండో స్థానంలో నిలిచింది.. సూపర్ సిక్స్ లో ఉన్న ప్రతి పథకాన్ని అమలు చేస్తున్నాం.. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని వంగలపూడి అనిత వెల్లడించింది.

## పులివెందులలో టీడీపీ విజయంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..



**అమరావతి,:** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ ఘన విజయం సాధించింది.. 6,033 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి విజయం సాధించారు..వైసీపీ అభ్యర్థి కేవలం 683 ఓట్లతో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు.. దీంతో, 30 ఏళ్ల తర్వాత పులివెందుల జడ్పీటీసీ స్థానం తెలుగుదేశం పార్టీ వశమైంది.. ఈ విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఘన విజయంపై మంత్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. జిల్లాలో అందరూ ఈ విజయం పట్ల రియాక్ట్ కావాలని సూచించారు.. పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి.. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిగాయి కాబట్టి 11 మంది నామినేషన్లు వేశారనే విషయాన్ని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్ రోజు 30 ఏళ్ల తర్వాత ఓటు వేశామని అక్కడి ప్రజలు స్లిప్పులు పెట్టారంటే.. అక్కడ ఇప్పటి వరకు పరిస్థితులు ఎలా ఉన్నాయో అనేది ప్రజలు గమనించాలని సూచించారు.. ఇక, పులివెందులలో జగన్ రెడ్డి అరాచకాలు నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారని వ్యాఖ్యానించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, పులివెందుల విజయంతో టీడీపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఇలాకాలో గ్రాండ్ విక్టరీ కొట్టామంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు..

## డిబేట్‌కు నేను సిద్ధం.. దమ్ముంటే మీరు రండి!



**హైదరాబాద్, :** ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. గతం కన్నా ఎక్కువ తెలంగాణకు కేంద్రం ఇచ్చిందని, ఇంకా కొంత మొత్తమే ఇవ్వాల్సి ఉందన్నారు. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుందని ఎద్దేవా చేశారు. యూరియా కొరతపై తాను డిబేట్‌కు సిద్ధం అని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రండని రాంచందర్ రావు సవాల్ విసిరారు. 'ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుంది. యూరియాను గతం కన్నా ఎక్కువగా తెలంగాణకు కేంద్రం ఇచ్చింది. ఇంకా కొంత మాత్రమే ఇవ్వాల్సి ఉంది. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారు. కేంద్రం రైతులకి మేలు చేస్తుంది. కాంగ్రెస్ మాత్రం రైతులకు ద్రోహం చేస్తుంది. ఎరువులు ఎటు వెళ్తున్నాయో దమ్ముంటే దర్యాప్తు చేయండి, లేదంటే సీబీఐకి అనుమతి ఇవ్వండి. దర్యాప్తుకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వంకు దమ్ము లేదు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలోకి వస్తే అక్కడ ఆ పార్టీ నాయకులే దళారులు. నాయకులే బ్లాక్ మార్కెట్ చేస్తారు. ఏ రాష్ట్రానికి ఎంత కోటా అనేది ముందే ఫిక్స్ అయి ఉంటుంది. బీఆర్ఎస్ ఆరోపణలు కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుంది. నేను డిబేట్‌కు సిద్ధంగా ఉన్నా, దమ్ముంటే రండి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు.

# జాబిలిపై అణువిద్యుత్ సాధ్యమా?

### అక్కడ మానవ ఆవాసాలు ఏర్పడితే అనుక్షణం విద్యుత్ అత్యావసరం
### అందుకే నిరంతర విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు
### మరో ఐదేళ్లలో నిర్మించాలని యోచన



వ్యోమగాములు తమ అంతరిక్ష పరిశో ధనలకు మజిలీగా చందమామను మార్చుకోవాలని భావిస్తున్న తరుణంలో చంద్రునిపై ఏకంగా అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పాలని నాసా భావిస్తోంది. అయితే 2030కల్లా అక్కడ న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎక్కువకాలంపాటు వ్యోమగాములు చంద్రునిపైనే స్థిరనివాసం ఏర్పర్చుకుని జీవించాలన్నా, ఎలాంటి విద్యుత్ అవాంతరాల లేకుండా శాస్త్రసాంకేతిక పరిశోధనలు కొనసా గించాలన్నా అనుక్షణం విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రాణాధార ఉపకరణాలకూ విద్యుత్ ఖచ్చితంగా అవసరం. అందుకే ఐదేళ్ల లోపే అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయా లని నాసా భావిస్తోంది. కేంద్రక విచ్ఛిత్తి (న్యూక్లియర్ ఫిజన్) సూత్రంపై పనిచేసే అణుప్లాంట్‌ను అక్కడ నెలకొల్పనున్నారు. అయితే నాసాకు పోటీగా సొంత అణువిద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చైనా, రష్యాలు సైతం ప్రకటించాయి. మరో పదేళ్లలో ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తామని ఇప్పటికే వెల్లడించాయి.

### అణు విద్యుతే ఎందుకు?

చందమామపై స్థిరనివాసం ఏర్పర్చుకునే వ్యోమగాముల నిరంతర విద్యుత్ అవసరా లను సౌరవిద్యుత్ ఏమాత్రం తీర్చలేదు. ఎందుకంటే చంద్రునిపై ప్రతిరోజూ సూర్యకాంతి ప్రసారం కాదు. 14 రోజులపాటు ఏకధాటి గా ఎండకాచి తర్వాత 14 రోజులపాటు మైనస్ డిగ్రీ సెల్సియస్ స్థాయిలో చిమ్మచీకటి నెలకొంటుంది. ఈ చీకటిమయ రోజుల్లో విద్యుత్ అవసరాలు తీర్చే ఏకైక ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్‌కేంద్రం నిలుస్తోంది. అందుకే ఎంత ఖర్చుయినాసరే వ్యయప్రయా సల కోర్చి చంద్రునిపై న్యూక్లియర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నాసా కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన లకు సైతం పచ్చజెండా ఊపింది. మరో ఐదేళ్లలో అక్కడ అణువిద్యుత్ ప్లాంట్ కలను సాకారంచేయాలని కంకణం కట్టుకుంది.

### చిన్నస్థాయిలో మొదలెట్టి

అణువిద్యుత్ కేంద్రంలో ఏవైనా ప్రమాదాలు సంభవించినా అక్కడ శూన్యం ఉంటుందికనుక రేడియోధార్మికత అంతటా వ్యాపిస్తుందన్న భయం అక్కర్లేదు. థర్మల్, జల, పవన విద్యుత్‌లతో పోలిస్తే చందమామపై అణువిద్యుత్ మాత్రమే ఆచరణ సాధ్యమవుతుంది. సౌరఫలకాలతో సూర్యకాంతిని ఒడిసిపట్టి సౌర విద్యుత్‌ను తయారుచేసినా అది అక్కడి వ్యోమగాముల అవసరాలను ఏమాత్రం తీర్చలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని న్యూక్లియర్ ప్లాంట్ వైపు శాస్త్రవేత్తలు మొగ్గుచూపుతున్నారు. తొలుత కేవలం 100 కిలోవాట్ల విద్యుత్‌ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నెలకొల్పనున్నారు. భూమి మీద అయితే ఇదే 100 కిలోవాట్ల విద్యుత్‌తో 80 గృహాల విద్యుత్‌అవసరాలు తీర్చొచ్చు. దశలవారీగా ప్లాంట్‌ను విస్తరించి గణనీయమైన స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు.

### సమస్యలెన్నో..

.జల, థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లతో పోలిస్తే అణువిద్యుత్ ప్లాంట్‌కు పెద్దగా భూవిస్తీర్ణంతో పనిలేదు. కానీ చంద్రుని మీదకు ఈ మొత్తం అణువిద్యుత్ వ్యవస్థ ఉపకరణాలను మోసుకెళ్లాలంటే చాలా చాలా కష్టం. పైగా ఇవి రాకెట్‌లో తరలించేంత తేలికగా ఉండాలి. అత్యధిక బరువులను ఇప్పుడున్న రాకెట్లు అస్సలుమోయలేవు. ఒకవేళ అధిక బరువులను మోసుకెళ్లేలా వ్యోమనౌకలను డిజైన్‌చేసి రూపొందించినా అవి అంత బరువును మోస్తూకూడా జాగ్రత్తగా చంద్రునిపై ల్యాండ్ కావాల్సి ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చి అది క్రాష్ ల్యాండ్ అయినా వేలకోట్ల రూపాయల నష్టం ఖాయం. భూమిపై అయితే అణువిద్యుత్ కేంద్రాన్ని ఎంతో మంది సాంకేతిక నిపుణులు తీరిగ్గా, నిశితంగా తనిఖీచేసి నిర్మిస్తారు. చంద్రునిపై ఈ ప్లాంట్‌ను నిర్మించాలంటే కార్మిక సిబ్బంది దొరకరు. ఉన్న ఆ కొద్దిపాటి వ్యోమగాములే అణుప్లాంట్ ఉన్నతాధికారుల అవతారమెత్తి ప్లాంట్‌ను బిగించాల్సి ఉంటుంది. అణువిద్యుత్ ప్లాంట్ నుంచి అత్యధిక స్థాయిలో వేడిమి వెలువడుతుంది. దానికి చల్లబరిచే కూలింగ్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. వాటిని కూడా భూమి మీద నుంచే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో శ్రమ, వ్యయంతో కూడిన వ్యవహారం. శూన్యస్థితిని తట్టుకునేలా వినూత్న రీతిలో ప్లాంట్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుంది. రేడియోధార్మిక వ్యర్థాల పారబోత, ప్లాంట్ పాడైతే రిపేర్లు వంటి ఎన్నో అవరోధాలు అక్కడి హఠాత్తుగా స్వాగతం పలుకుతాయి. వీటిని తట్టుకుంటూనే ప్లాంట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ట్రంప్ హయాంలో నాసాకు అంతరిక్ష పరిశోధనా బడ్జెట్‌లో భారీ కోత పెట్టిన నేపథ్యంలో ఇతర మార్గాల్లో ఆదాయం సమకూర్చి ఈ ప్రాజెక్ట్‌ను సఫలీకృతం చేయాల్సి ఉంది. ఇన్ని బాలారిష్టాలను దాటుకుని ప్లాంట్ ఏర్పాటు సుసాధ్యమైతే జాబిలిపై మానవనివాసం ఎలాంటి జంజాటాలు లేకుండా హాయిగా సాగుతుంది.

# ప్రజాస్వామ్యం ఖూనీ




పులివెందులలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలను మెడ పట్టుకొని నెట్టివేస్తున్న పోలీసులు కళ్లు మూసుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం సాక్షిగా, రౌడీమూకల్లా చెలరేగిన పోలీసుల సాక్షిగా మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల, అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో పచ్చమందలు అక్షరాలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయి. నిజమైన ఓటర్లు పోలింగ్ కేంద్రాల సమీపానికి రాకుండా అధికార పక్షం దౌర్జన్యాలకు దిగితే.... వాటిని ఎదిరించి వచ్చినవారిని పోలీసులు తరిమికొట్టారు. ఓటు వేసేందుకు అనుమతించాలంటూ కాళ్లావేళ్లా పడినవారిని సైతం కనికరించలేదంటే... ఓటర్ల దగ్గర స్లిప్‌లు గుంజుకుని, మీ దగ్గర స్లిప్‌లు లేవుగనుక ఓటేయటం కుదరదని పోలీసులు దబాయించారంటే ఏపీలో పరిస్థితేమిటో అర్థంచేసుకోవచ్చు. ఏనాడూ సవ్యంగా అధికారంలోకి రావటం చేతగాని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రెండు స్థానాల్లో అక్షరాలా ప్రజాస్వామ్యాన్ని క్కించారు. దీన్ని కప్పిపుచ్చ టానికి బుధవారం రెండు కేంద్రాల్లో మాత్రం రీపోలింగ్ తంతు నిర్వహించి అయిందనిపించారు. తొలినాటి ఉదంతాలే మర్నాడూ పునరావృత మయ్యాయి. స్థానికేతర టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ చెలరేగిపోతుంటే చోద్యం చూసిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ స్థానిక నాయకుల్ని అరెస్టులతో, గృహనిర్బంధాలతో ఎటూ కదలనివ్వలేదు. అభ్యర్థులను తిరగనివ్వలేదు. అసలు రాష్ట్ర ఎన్నికల సంఘం అక్రమంగా నాలుగు గ్రామాల పోలింగ్ కేంద్రాలను 2 నుంచి 4 కిలోమీటర్ల దూరాల్లోవున్న వేరే గ్రామాలకు తరలించటంతోనే ఈ ఉప ఎన్నికల ప్రహసనం మొదలైంది. అన్ని కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటేయటం వృద్ధులకూ, అనారోగ్యం బారినపడిన వారికీ అసాధ్యమని లెక్కేసుకుని ఈ మార్పు చేశారు. మహిళలు, వృద్ధులతోసహా సాధారణ ఓటర్లంతా ఇలాంటి మాయోపాయాలను బేఖాతరు చేశారు. కానీ వారికి రక్షణగా నిలబడాల్సిన పోలీసులే వృత్తి ధర్మానికి ద్రోహం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాలు మార్చటాన్ని హైకోర్టు తప్పుబట్టినా, చివరి నిమిషంలో సవరించటం అసాధ్యమని భావించింది. ఇదే అదునుగా జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు వంటి చోట్లనుంచి వచ్చిన రౌడీమూకలు ఎడాపెడా రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రంలో వుండగానే దొంగ ఓటర్లు బారులు తీరారంటే ఈ బరితెగింపు ఏ స్థాయిలో వున్నదో అర్థం చేసుకోవచ్చు. తెలిసో తెలియకో తమ 'ఘనత'ను చాటుకోవటానికి జిల్లా కలెక్టర్ ఈ ఫోటోలనే సామాజిక మాధ్యమాల్లో వుంచి నగుబాటుపాలై తిరిగి వాటిని తొలగించాల్సి వచ్చింది. అధికారులకు వ్యక్తిగత స్థాయిలో ఇష్టాయిష్టాలుండొచ్చు. అధికార పార్టీకి పరిచారికలుగానో, పాలేఱు ్లగానో మారాలని ప్రాణం కొట్టుమిట్టాడొచ్చు. అలాంటివారు రాజీనామా చేసి పోవాలితప్ప, జనం ఎంతో కష్టపడి పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును నెలనెలా జీతాలుగా తీసుకుంటూ... కుటుంబాలను పోషించుకుంటూ కాలసర్పాల మాదిరిగా అదే జనాన్ని కాటేయాలని చూడకూడదు. సిగ్గూ లజ్జా, మానాభిమానాలు వున్నవారెవరైనా ఇలాంటి హీనస్థితికి దిగజారతారా? ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి తరమటం మాత్రమే కాదు... కనీసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లను కూడా పోలింగ్ కేంద్రాల్లోకి రానీయకుండా నిర్వహించిన ఈ ఉప ఎన్నికలు 'ప్రశాంతంగా' జరిగాయని ప్రకటించటానికి అధికార యంత్రాంగానికి ఏమాత్రం సిగ్గనిపించకపోవటం విస్మయం కలిగిస్తుంది. పులివెందుల జెడ్పీటీసీ స్థానంలో 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం అని సాక్షాత్తూ రాష్ట్ర ఎన్నికల సంఘమే ప్రకటించింది. మరి అక్కడుండే వైఎస్సార్ కాంగ్రెస్ ఏజెంట్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? మంత్రి సమక్షంలోనే పోలింగ్ ఏజెంటును ఒక్కడిని చేసి అత్యంత దారుణంగా కొట్టారన్న సమాచారం ఆ సంఘానికి చేరిందా? అనేకచోట్ల ఏజెంట్లు లేకుండానే పోలింగ్ కొనసాగిన వైనం ఆ సంఘానికి తెలుసా? ఓటర్లెవరో, కానివారెవరో గుర్తించటానికి ఏజెంట్లుంటారు. పోలింగ్ పూర్తయ్యాక అంతా సవ్యంగా పూర్తయినట్టు వారినుంచి సంతకాలు తీసుకుంటారు. జరిగిన తంతు చూస్తుంటే ఆ సంతకాలను కూడా ఫోర్జరీ చేయదల్చుకున్నారా అనే సంశయం ఏర్పడుతోంది. పోయే కాలానికి కుక్కమూతి పిందెలని నానుడి. సాధారణ ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా అక్రమాలకు పాల్పడటం ఆదినుంచీ అలవాటైన బాబుకు 'అతని కంటె ఘనుడ'న్నట్టు పుత్రరత్నం తోడయ్యాడు. అందుకే ఈసారి బరితెగింపు అవధులు దాటిన వైనం కనబడుతోంది. ఇలాంటి దుష్టపోకడల్ని చూస్తూ వూరుకుంటే ప్రజాస్వామ్యం బతికి బట్టగట్టదు. న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలి. ప్రహసన ప్రాయంగా మారిన ఈ ఉప ఎన్నికలను రద్దుచేయాలి. బాధ్యులైన అధికార్లను సాగనంపాలి. వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్ చేసినట్టు కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి పోలింగ్ నిర్వహించాలి.

# 'ఓటు చోరీ'పై ఉద్యమం




బీహార్‌లో ఓట్లచోరీ తతంగంపై పార్లమెంటు ప్రతిపక్ష సభ్యులు చేపట్టిన ఉద్యమానికి ప్రజల మద్దతు పెరుగుతోంది. మొన్న మూడు వందల మంది ఎంపీలు పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత కార్యక్రమం చేపట్టడం దేశం దృష్టిని ఆకర్షించింది. యాత్రకు అనుమతిలేదంటూ వారిని పోలీసులు మధ్యలోనే అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడే క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు ఎంపీలు సొమ్మసిల్లి పడిపోవడం విచారకరం. ప్రతిపక్షనాయకునితో సహా ఎంపీలను అరెస్టుచేసి పోలీసువ్యానుల్లో కుక్కడం మరీ దారుణం. ఇది సర్కార్ అణచివేతకు పరాకాష్ట. అంతేకాదు, ప్రశ్నించే గొంతులను ఏక పక్షంగా నొక్కేయడమే. ఎందుకింత అక్కసు? ప్రజాస్వామ్యంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలని కోరుకోవడం తప్పా? ఇంతటి నిర్భంధాన్ని ప్రయోగించడాన్ని చూస్తుంటే అవకతవకలకు నేతృత్వం వహించింది కేంద్రమేనా? ఈసి నోరెందుకు మెద పడం లేదు? ఇలాంటి ప్రశ్నలు సామాన్యపౌరులెవరికైనా రావడం సహజం. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్)పై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పద్దెనిమిది రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. కానీ, అందుకు కేంద్రం సిద్ధపడటం లేదు. పైగా వారి వాదనలను కనీసం పట్టించు కున్న దాఖలాలు లేవు. ఇదే అంశంపై సీఈసీతో మాట్లాడేందుకు ఎంపీల బృందం వెళ్లగా వారిని అనుమతించలేదు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్న తరుణంలో, ఓటుపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్న సమయంలో ప్రజాప్రతినిధులకు సమాధానం చెప్పేందుకు ఈసికి ఎందుకింత భయం? ఎంపీలను కలవకపోవడంలో ఆంతర్యమేంటి? దీన్నిబట్టి చూస్తే కేంద్రం కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందా? ఓట్‌చోరీపై కచ్చితమైన వివరణ కావాలంటూ విపక్షాలు వినూత్న పద్ధతుల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టడంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది నిజం. ఓవైపు ఈ చర్చ నడుస్తుండగానే బీహార్ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓట్ల జాబితాలో ఆశ్చర్యకరమైన విషయం వెలుగుచూసింది. మింతా దేవి ఓటరు ఐడీలో వయసు 124 అని ముద్రించడం ఎన్నికల సంఘం డొల్లతనాన్ని, సర్కారు నిర్లక్ష్యాన్ని బట్ట బయలు చేసింది. కర్నాటకలో బహుళ వ్యక్తులు, బహుళ ఓట్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దేశప్రజలకు ప్రత్యక్షంగా చూపించారు. మరి కేంద్రానికి, ఎన్నికల కమిషన్‌కు కనపడట్లేదా? ఈసి ఇచ్చిన డేటాతోనే కదా వివరించారు. మరెందుకు స్పందించడం లేదన్నది చర్చ. భిన్నభిప్రాయాలు కలిగినదే ప్రజా స్వామ్యం. అలాంటి వ్యవస్థ ఉన్నచోట ప్రతి పక్షాలు చెప్పేదేంటో వినాలి, చర్చించాలి. అవ సరమైన సూచనలు పరిగణలోకి తీసుకోవాలి. కానీ 'మేం చెప్పిందే వినాలన్న' రీతిలో కేంద్రం వ్యవహరిం చడం సమంజసం కాదు. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పా క్షికంగా తమ నాయకులను ఎన్నుకునే శక్తివంతమైన ప్రక్రియ ఎన్నికలు. దానికే అవంతరాలు ఏర్పడుతుంటే ప్రశ్నించకూడదా? చర్చించకూడదా? వివరణ తీసుకోకూడదా? ఇవన్నీ అడిగితే అరెస్టు చేసి నిర్బంధిస్తారా? ఎన్నికల కమిషన్‌లో పారదర్శకత లోపించిందని చెప్పడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి? విపక్షాలు అడిగే ఓట్ల జాబితాను ఇవ్వకపోవడం వెనుక ఉన్న మతలాబేంటి? ఆటోమాటెడ్ విశ్లేషణ ద్వారా లోపాలు గుర్తించడానికి వీలు కల్పించే యంత్రాలతో చదవగలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు ఈసి ఎందుకు నిరాకరిస్తోంది? ఇది ప్రజల్లో పలు అనుమానాలను రేకెత్తించడమే కాదు, ఓట్‌చోరీ అంశాన్ని బలపరుస్తున్నది కూడా. ఇది ముమ్మాటికీ ప్రజా స్వామ్యాన్ని వంచించే చర్య. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి ఒక్కరికీ ఒక ఓటును ఆయుధంగా ఇచ్చింది. కానీ, దీనికి భిన్నంగా కేంద్రంలోని బీజేపీ మాత్రం ఒక్కొక్కరికి పదుల సంఖ్యలో ఓట్లు కల్పించి ప్రజాస్వామ్యాన్నే అభాసుపాలు చేసింది. ఓడిపోతామనుకున్న ప్రతి నియోజక వర్గంలో ఓట్లచోరీతో అడ్డదారుల్లో అధికారాన్ని చేజిక్కించుకుందని బహిర్గతమైంది! ఇది ప్రపంచంలోనే ఎంతో ఖ్యాతిగాంచిన మనదేశ ఎన్నికల చరిత్రను కల్మష పరిచింది. మనం స్వతంత్రంగా వేసుకునే ఓటును ఎవరో దొంగిలించడం, దాన్ని ప్రశ్నిస్తే అణిచివేయడం ప్రజాస్వా మ్యానికి ముంచుకొస్తున్న అతిపెద్ద ప్రమాదానికి సంకేతం. 'మన ఓటును దోచుకుంటున్నారు. మన హక్కును దోచు కుంటున్నారు. మన ఉనికినే ప్రశ్నార్థకం చేసున్నారు.' అంటే మనం జాగ్రత్తగా లేమనడానికి నిదర్శనం. ఇలాంటి సమయంలో పౌరునిగా మనపాత్ర మనం వహించాలి. విపక్షాలది రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటుహక్కును కాపాడటం కోసం చేస్తున్న ఉద్యమం. దాన్ని బలపరచడానికి చైతన్యవంతంగా ఆలోచించాలి. అందుకే ఓటుచోరీ..ఎక్కడో కదా, మనది కాదు అనుకుంటే, రేపు మనఓటు దూరమవటమే కాదు, ప్రజాస్వామ్యమే దూరమవుతుంది.

## కిష్త్వార్‌లో క్లౌడ్ బరస్ట్.. 17 మంది మృతి



**న్యూఢిల్లీ,:** గురువారం జమ్మూ కశ్మీర్‌లోని కిష్త్వార్‌లో క్లౌడ్ బరస్ట్ సంభవించి 17 మంది మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. హిమాలయ పుణ్యక్షేత్రం మాతా చండికి మచైల్ మాతా యాత్ర వెళ్తున్న మార్గంలో ఈ విపత్తు సంభవించింది, దీంతో యాత్రా మార్గం గందరగోళంగా మారింది. యాత్ర కోసం విధుల్లో ఉన్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది మరణించిన వారిలో ఉన్నారు. మరో ముగ్గురు CISF జవాన్లు గల్లంతయ్యారు. సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి, ప్రాణాలతో బయటపడిన వారిని వెతకడానికి, చిక్కుకున్న వారిని తరలించడానికి పెద్ద ఎత్తున కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. యాత్ర ప్రారంభ స్థానం నుండి యాత్రికులను హడావిడిగా ఖాళీ చేయిస్తున్నట్లు ఘటనా స్థలానికి సంబంధించిన వీడియోలను చూస్తే అర్థం అవుతోంది. రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి బయలుదేరాయి. నష్ట నివారణ, అవసరమైన రెస్క్యూ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ పంకజ్ శర్మ, ప్రభావిత ప్రాంతంలో రెస్క్యూ కార్యకలాపాలు ప్రారంభించినట్లు ధృవీకరించారు.

## అదో చెత్త పదం.. 'ఓట్ల చోరీ విధానం'పై స్పందించిన ఈసీఐ..




**న్యూఢిల్లీ,:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇండియన్ బ్లాక్‌కి చెందిన నేతలు ఓటు చోరీ అనే పదాన్ని పదే పదే ఉపయోగించడంపై భారత ఎన్నికల కమిషన్ గురువారం స్పందించింది. దొంగ ఓటు అనే పదాన్ని చెత్త పదంగా అభివర్ణించింది. ఇది కోట్లాది మంది భారతీయ ఓటర్లపై ప్రత్యక్ష దాడిగా, లక్షలాది మంది ఎన్నికల సిబ్బంది సమగ్రతపై దాడిగా ఎన్నికల సంఘం అభివర్ణించింది. 1951-52లో భారతదేశంలో జరిగిన మొదటి ఎన్నికల నుంచి "ఒక వ్యక్తి, ఒక ఓటు" చట్టం అమలులో ఉందని ఈసీఐ నొక్కి చెప్పింది. ఒక వ్యక్తి రెండుసార్లు ఓటు వేసినట్లు రుజువు ఉంటే.. ప్రమాణ స్వీకారం చేసిన అఫిడవిట్‌తో కమిషన్‌కు సమర్పించాలని పోల్ బాడీ పేర్కొంది. ఓటర్లను ఆధారాలు లేకుండా "దొంగలు" అని ముద్ర వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. దేశంలో ఓటర్ల జాబితాకు సంబంధించి రాహుల్ గురువారం ప్రజెంటేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'ఓట్ల చోరీ విధానం' దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని ఆయన ఆరోపించారు. దీనికి 'మహాదేవపుర' ఓటర్ల జాబితాయే నిదర్శనమన్నారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్లు చోరీకి గురైనట్లు తేలిందన్నారు. ఈ వ్యవహారంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని కోరారు. అయితే రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం అడిగినట్లుగా అఫిడవిట్ దాఖలు చేయడానికి నిరాకరించారు. తాను లేవనెత్తిన అంశాలు ఎన్నికల సంఘం స్వంత వెబ్‌సైట్లోని డేటా నుంచే వచ్చాయని.. సాక్ష్యాలు అడగడం ఈ విషయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎన్నికల సంఘం చేస్తున్న ప్రయత్నమే అని ఆయన బదులిచ్చారు.

## ఏపీ సెక్రటేరియట్?లో నో ప్లాస్టిక్..
## ఈ నెల 18 నుంచి అమలు..




**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 18 నుంచి రాష్ట్ర సెక్రటేరియట్ లో నో ప్లాస్టిక్ విధానం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. ఇక నుంచి గాజు, స్టీల్ సీసాలతో నీటి సరఫరా చేయనున్నారు. అలాగే, ఉద్యోగులకు స్వచాంధ్ర కార్పొరేషన్ సహకారంతో స్టీల్ బాటిళ్లు పంపిణీ చేయనున్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బాగ్ స్టాల్ ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ప్రారంభించారు. ఇక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. 8 నెలలుగా రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతోంది.. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం పై దృష్టి పెట్టాం.. ఏపీ సచివాలయంలో మొదటి సారి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నాం.. సచివాలయంలో ప్లాస్టిక్ పెట్ బాటిళ్లు వాడుతున్నారు.. సచివాలయంలో ఉద్యోగులకు స్టీల్ బాటిళ్లు అందిస్తున్నాం.. కొన్ని ప్రాంతాల్లో గ్లాస్ బాటిళ్లు ఉపయోగిస్తాం.. హ్యూమన్ టచ్ లేకుండా.. కొత్త టెక్నాలజీతో గ్లాస్ బాటిళ్లు రీ ఫిలింగ్ జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ ప్లేట్స్. విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం.. సింగిల్ యూజ్డ్ ప్రత్యామ్నాయ పద్ధతిలో మెప్మా ఆధ్వర్యంలో జ్యూట్ బాగ్ లు, కొబ్బరి పీచుతో చేసిన బ్యాగులు అందుబాటులో ఉంటాయని సురేష్ కుమార్ వెల్లడించారు.

## రాహుల్ గాంధీ నియోజకవర్గంలో
## 71 వేల 977 దొంగ ఓట్లు..!



**హైదరాబాద్, :**రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. రాజీవ్ గాంధీ ఆలోచన ప్రోగ్రెస్, రాహుల్ గాంధీ ఆలోచన డిస్ట్రక్టివ్ అని విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని.. బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించి ఓటు తీసేస్తారనే భయపుట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ గెలిచిన రాయబరెలిలో 2 లక్షల ఓట్లపై అనుమానం ఉందని.. 71 వేల 977 ఫేక్ ఓటర్స్ ఉన్నారనన్నారు ఎంపీ రఘునందన్‌రావు. 92 వేల 447 మాస్ ఓటర్ నమోదు చేశారని 54 వేల ఫేక్ బర్త్ డే సర్టిఫికేట్‌లు పెట్టారని ఆరోపించారు. వయనాడ్, డైమండ్ హార్బర్ నియోజక వర్గాలపై కూడా అనుమానం ఉందన్నారు. డింపుల్, అఖిలేష్ యాదవ్ నియోజక వర్గాల్లో కూడా దొంగ ఓట్లు ఉన్నాయని చెప్పారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లుతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని సూచించారు.

# రట్టుకాని 'ధర్మస్థల' గుట్టు



ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు'గా ఉంది కర్నాటక లోని ధర్మస్థల మంజునాథ స్వామి దర్శనం. భక్తులు అదృశ్యమై అస్థిపంజరాలుగా మారడం అంతుచిక్కని మిస్టరీ, ఇటీవలే సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. సినిమా ఫక్కీలో జరుగుతున్న దేవాలయ ట్రస్టీ బోర్డు దారుణాల గుట్టు రట్టు చేసి మంత్రులైనా, ఎంత పెద్ద హోదాలో ఉండిన వారైనా, వారు చేసిన నేరాలకు తగిన కఠినశిక్ష పడాల్సిందే. ఇది ఒక మతానికే సంబంధించినదిగా భావించకుండా మానవత్వానికి సంబంధించిన అంశంగా పరిగణించాలి. ఈ సంఘటన ప్రభుత్వానికి విసిరిన పెద్ద సవాల్. అసహజ మరణాల గురించి ఆరా తీస్తుంటే అన్ని శక్తులు కలిసి పని చేసి ఉండవచ్చు అన్నసందేహం బలంగా ఉంది. పుణ్య స్థలానికి వచ్చిన వందలాది మంది పురుషులు, మహిళలు కనపడకుండా పోయి ధర్మస్థల పరిసర ప్రాంతాలలో శవాలుగా మారడం మానవాళి మనుగడకే ముప్పు. ఇదంతా చూస్తుంటే డ్రగ్స్ మత్తుకన్నా మతం మత్తుతో మనిషన్నవాడు మాయమైపోతున్నాడు అన్నది నగ్నసత్యం. ఇది హిందూ సంస్కృతి సంప్రదాయంపై చేసిన విమర్శగా భావించరాదు. మనిషి మనిషిలా బతకాలి అన్నదే మనిషన్నవాడు కోరుకున్నది. భక్తి తొక్కిసలాటలో మానవత్వం నలిగి పోతున్నది. అగ్నికి ఆజ్యం పోసినట్లు కాషాయ వస్త్రధారులు కట్టు కథల ప్రవచనాలతో ప్రజలను మోసగించి వ్యాపారాలు చేస్తున్నారు. హిందూ సనాతన ధర్మంపేరిట అశాస్త్రీయ పద్ధతులతో జనాలను తప్పుదు దారిపట్టిస్తున్నారు. దానికి మన పాలకులు వంత పాడుతున్నారు. ధర్మస్థలిలో చాలా కాలం నుండి లెక్కలేనన్ని మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు ఓ పారిశుద్ధ్య కార్మికుడు దక్షిణ కన్నడ జిల్లా ఎస్పి అరుణ్‌కు జులై రెండో వారంలో రాసిన ఓ లేఖ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'తన చేత ఆ పనులు చేయించిన కొందరు వ్యక్తులు తమ కుటుంబానికి చెందిన యువతి పైనే అఘాయిత్యానికి పాల్పడడంతో బెదిరిపోయి ఆ ప్రాంతం వదిలి పారిపోయినట్టు ఆ పారిశుద్ధ్య కార్మికుడు చెప్పినట్లు వార్తలు వినబడుతున్నాయి. తనకు రక్షణ కల్పిస్తే అన్ని నిజాలు బయట పెడతా అంటూ అతడు తన లేఖలో స్పష్టంగా రాయడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి జులై 19న నలుగురు సీనియర్ ఐపిఎస్‌లతో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.ఆ కార్మికుడు ఇచ్చిన కొన్ని ఆధారాలతో 13 పాయింట్‌లను గుర్తించి తవ్వడంతో బుధవారం 30 జులై ఒక పాయింట్ వద్ద తవ్వుతుండగా ఒక అస్థిపంజరం అవశేషాలు పాక్షికంగా బయటపడినట్లు సమాచారం.

మరోచోట మహిళ అవశేషాలు కనిపించాయని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంతకు ఆ అపరిచిత వ్యక్తి ఎవరు? కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు ఎందుకు ఉన్నాయి? తెరవెనుక ఉండి మనుషులను మింగుతున్న ఆ అపరిచిత వ్యక్తి ఎవరు? ఆ మానవ మృగాలను రచ్చ కీడువాలి. రాజ్యసభ సభ్యుడైన డాక్టర్ వీరేంద్ర హెగ్డే ఐదు దశాబ్దాలుగా ఆలయ ధర్మాధికారిగా ఉంటున్నారని వార్తలు వచ్చినాయి. రాజ్యసభ సభ్యుడై ఉండి కూడా ఎందుకు ఈ ఘోరాలకు కళ్ళెం వేయడం లేదు. గత పదేళ్లలో ధర్మస్థలము చుట్టు పక్కల 450 మందికి పైగా అదృశ్యమైనట్లు పోలీస్ లెక్కలు చెబుతున్నాయి. అక్కడి స్థానికులు కూడా దీన్ని బలపరిచారు. నేత్రావతి ఇసుక పాయల్లో కలిసిపోయిన శరీరాలు ఎన్నెన్నో. మంజునాథ ఆలయానికి సంబంధించిన వ్యక్తులే ఈ అదృశ్య మరణాల వెనుక ఉన్నారని, అందుకే తాను అక్కడినుండి పారిపోయానని పారిశుద్ధ్య కార్మికుడు చెప్పడంతో అక్కడ ఏమి జరుగుతుందో తెలుసు కోవాలనే ఆరాటం భక్తులలో, స్థానికులలో మెండుగా ఉంది. ఈ అపరిచిత వ్యక్తుల బండారం బయటపడితే గ్రామం నుండి ఢిల్లీ దాకా ట్రస్టీ బోర్డు, వారికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధుల పునాదులు కదలనున్నాయి. పాతికేళ్లుగా ఎవరు తొక్కిపెడుతున్నారు? ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారు? అన్న విషయం తెలియాలి. అసహజ మరణాలకు సంబంధించిన ఆరోపణలు 2015లో వస్తే రాష్ట్ర ప్రభుత్వం 'ఉగ్రప్ప' కమిటీని ఏర్పాటు చేసింది. ఆ నివేదిక ప్రకారం 300 మంది పురుషులు, మహిళలు, మరికొందరు బాలలు అసహజ మరణాలకు గురి అయినారని కమిటీ తెలియచేసినప్పటికీ చర్యలు మృగ్యం. దీని వెనుకాల పెద్దల హస్తం ఉందని తెలుస్తున్నది. మరో విషయం ఏమంటే ఈ అసహజ మరణాలలో డాక్టర్లు, జర్నలిస్టులు కూడా ఉండడం విశేషం. సిట్ దర్యాప్తు బృందం కూడా నీరుగారిపోయే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ దారుణాల మిస్టరీ తేలక పోతే ధర్మస్థల చరిత్ర ఆధర్మ స్థలంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని భక్తులు వాపోతున్నారు. మిస్టరీ వెనుక అదృశ్యహస్తాన్ని త్వరగా వెలికి తీయాలి. మానవవాదులు, హేతువాదులు, ముక్తకంఠంతో గొంతెత్తి ఆ దేవాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నేరస్థులను శిక్షించాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాల కాలంలో జరిగిన అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులు కావాలని సమాచార హక్కుల కార్యకర్త జయంత్ ఆర్‌టిఐ ద్వారా కోరగా పత్రాలు, పోస్టుమార్టం నివేదికలు, వాల్ పోస్టర్లు, నోటీసులు, గుర్తు తెలియని గుర్తింపు కోసం తీసిన ఫోటోలు, సాధారణ పరిపాలన ఆదేశాల మేరకు ధ్వంసం చేశామని బెల్తంగాడి పోలీసులు సమాధానం చెప్పడం కలకలం రేపుతుంది. ఈ విషయం జయంత్ సోషల్ మీడియాకు వెల్లడించారు. సమాచారం డిజిటల్ చేయకుండా ధ్వంసం చేయడంలో అంతరార్థం మేమిటని ప్రశ్న? ప్రశ్నగానే ఉండిపోతుందా? ప్రధాని మోడీ ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన నేతగా పలుమార్లు తొలి స్థానంలో నిలిచారు. ఇది సంతోషించదగిన విషయమే కాని ఇంట గెలిచి రచ్చ గెలవాలి.

# జనచైతన్యంతోనే జవాబుదారీ పాలన




భారత రాజ్యాంగ ప్రవేశిక (పీఠిక)లో, ప్రాథమిక హక్కులలో, ఆదేశిక సూత్రాలలో విద్య, -వైద్యం,- ఆరోగ్యానికి సంబంధించిన రాజ్యంగ రక్షణలు ఉన్నాయి. 1993 సం?లో ఉన్ని క్రిష్ణన్ - స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీం కోర్టు 14 సంవత్సరాల బాలబాలికలు విద్య పొందటం అనేది భారత రాజ్యాంగంలోని జీవించే హక్కు (21వ, అధికరణం)లో ఇమిడి ఉన్న ప్రాథమిక హక్కుగా పేర్కొన్నది. 86వ రాజ్యాంగ సవరణ చట్టం (2002) ద్వారా విద్యా హక్కును 21 'ఏ' అధికరణంగా ప్రాథమిక హక్కుల జాబితాలో పొందుపరిచారు. ఆదేశిక సూత్రాలలోని 45వ అధికరణం ప్రకారం ఆరు సంవత్సరాలలోపు బాలలకు ప్రారంభ శిశుసంరక్షణ విద్య కల్పించాలి. 350 'ఏ' అధికరణం కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రాథమిక విద్య కోసం కృషిచేయాలని చెబుతుంది. 11వ షెడ్యూల్ వైద్య విద్య, ప్రాథమిక, ఉన్నత స్థాయి విద్యలు, పేదలకు విద్యా సౌకర్యాలు, వృత్తి విద్య శిక్షణల గురించి వివరిస్తుంది. విద్య-, వైద్యం రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలోని అంశాలు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేసి అమలు పర్చడానికి వీలుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య-, వైద్య మంత్రిత్వశాఖలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు విద్య-, వైద్య-, ఆరోగ్య సేవలను అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ అంతంత మాత్రంగానే అందుతున్నాయి. సరైన వసతులు లేకపోవడం, కావల్సిన విద్య, వైద్య సౌకర్యాలు కల్పించకపోవడం, సిబ్బంది కొరత, ఉద్యోగుల నిర్లక్ష్యం, అధికారుల అవినీతి, నిధుల కొరత, తదితర సమస్యలతో ప్రభుత్వ విద్య, -వైద్య రంగాలు/ సంస్థలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ రంగంలో బహుళ అంతస్తులలో నడుస్తున్న విద్య-, వైద్యం కోటాను కోట్ల రూపాయలను సంపాదించే అత్యంత లాభసాటి వ్యాపారంగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. కార్పొరేట్ కాసుల వైద్యాన్ని భరించలేని గ్రామీణ ప్రజలు ఏ దిక్కు లేనప్పుడు దేవుడే దిక్కు అన్నట్లు దేవుడి మీద భారం వేసి రోజులు లెక్కపెడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నిరక్షరాస్యులైన దళితులు, గిరిజనులు, బహుజనులకు విద్య-, వైద్య సదుపాయాలు అందకపోవడం మూలంగా దేవుడు రోగాలు నయం చేస్తాడని చెబుతున్న మత బోధకుల మాటలకు ఆకర్షితులై ఎక్కువ మంది ప్రజలు మూఢ నమ్మకాలను, అంధవిశ్వాసాలను బలంగా/ గుడ్డిగా నమ్ముతున్నారు. గిరిజన తండాలు, కోయ గూడాలు, గ్రామీణ ప్రాంతాల పేదప్రజలు అనివార్యంగా ఈ రకమైన చర్యల వైపు నెట్టివేయబడుతున్నారు. ఈ పాపం పాలకులదే. విద్య-, వైద్యం-, ఆరోగ్యం ప్రాథమిక హక్కులలో ఒకటైన జీవించే హక్కు (21వ అధికరణం)లో అంతర్భాగమైనప్పటికీ ఆచరణలో రక్షణ కరువైన ప్రాథమిక హక్కుగానే మిగిలిపోతుందనేది నగ్నసత్యం. విద్య-, వైద్యం-, ఆరోగ్యం ప్రాథమిక హక్కులలోనే కాదు మానవ హక్కులలోను అంతర్భాగమే. సుప్రీం కోర్టు అనేక సందర్భాలలో విద్య-, వైద్యాన్ని సేవలుగానే నిర్వహించాలి తప్ప వ్యాపార ధోరణితో నిర్వహించి తద్వారా వచ్చిన లాభాలతో మరో చోట సంస్థలను నిర్వహించరాదని స్పష్టం చేసింది. కార్పొరేట్ యాజమాన్యాలు విద్య-, వైద్య రంగాలలో పరిధులు, పరిమితులు దాటి, ఎల్లలులేని వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్వహిస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నప్పటికీ చేష్టలుడిగిన ప్రభుత్వాలు ఉద్దేశపూర్వక ఉపేక్షను ప్రదర్శిస్తున్నాయి.

సంక్షేమ పథకాల పేరిట ఊదరగొడుతున్న ప్రభుత్వాలు సంపన్నుల జేబులు నింపడానికి పోటీపడుతున్నాయి. ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్యా హక్కు చట్టం (2009) పూర్తిగా లోపభూయిష్టమైనది. ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీన పర్చే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం మన దేశంలో 6- 14 సంవత్సరాల వరకు ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్యను అందించాలి. దీని ప్రకారం 1 నుండి 8వ తరగతి వరకు మాత్రమే వర్తిస్తుంది. సెకండరీ, మాధ్యమిక, ఉన్నత విద్యను ఈ చట్టం పూర్తిగా వదిలేసింది. అంతే గాక 1వ తరగతి కన్నా ముందున్న పూర్వ ప్రాథమిక విద్యను కూడా ఈ చట్టంలో పేర్కొన లేదు. ఈ చట్టంలో పేర్కొన్నట్లు 1- 5 తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు సరైంది కాదు. 1: 30 ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య సరైంది కాదు. 1-5 తరగతులలో 5 తరగతుల వరకు 18 సబ్జెక్టులు, 40 పీరియడ్లు ప్రతి రోజు నిర్వహించాలి. అంతేగాక పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కెజి, యుకెజి) నేర్పించాలి. వ్యాయామం, ఆటలు నేర్పించాలి. ఇదంత ఒక్కరో, ఇద్దరో ఉపాధ్యాయులతోని సాధ్యమయ్యే పనికాదు. కనీసం 7 గురు ఉపాధ్యాయులు ఉంటే కానీ సాధ్యం కాదు. ఈ చట్టం ప్రకారం ప్రతి యేటా 25% మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పేద విద్యార్థులను ప్రైవేటు విద్యా సంస్థలల్లో చేర్పించాల్సి ఉంది. ఇది కనుక అమలైతే నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య సున్నకు చేరుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడానికి పాలక వర్గాలకు మార్గం సులువవుతుంది. ఇదో రకంగా పేద ప్రజలకు విద్యను దూరం చేసే కుట్రలో భాగమే. ఈ చట్ట నిబంధనలతో విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటు రంగాలకు అప్పజెప్పి ప్రభుత్వాలు చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల కాలంలో అధిక ధనార్జన కలిగిన కార్పొరేట్ విద్య-, వైద్య సంస్థల అధిపతులు, ప్రజాప్రతినిధుల రూపంలో చట్టసభలలోకి ప్రవేశించడం, మంత్రి పదవులు చేపట్టడం సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఈ రకమైన పరిణామం రాజ్యంగ స్ఫూర్తిని సమూలంగా దెబ్బతీస్తుంది. ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువలపట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది. విద్య, వైద్యం, ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కుగా శాసనాలు రూపొందించడంలో, వాటిని అమలు పరచడంలో పార్లమెంటు ఆయా రాష్ట్రాల శాసన సభలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, న్యాయ వ్యవస్థలు నిర్లిప్త వైఖరి అవలంబిస్తూ రాజ్యాంగాన్ని, శాసనాలను రాతలకే పరిమితం చేస్తున్నాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల ఈ రకమైన వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. ప్రాథమిక హక్కుగా పేర్కొంటున్న విద్య, వైద్యం, ఆరోగ్యం అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేలా ప్రజలను చైతన్యం చేస్తూ, ప్రజాపోరాటాలను ఉధృతం చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులు, మేధావులు, పౌర సమాజంపై ఉంది. జనచైతన్యంతోనే జవాబుదారీ పాలన ఏర్పడుతుంది. జవాబుదారీ పాలనలోనే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన, సమానమైన విద్య, వైద్యం, ఆరోగ్యం అందుతుంది.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. గాలిలో దీపాలా?

సాఫ్ట్‌వేర్ రంగం తన ఉద్యోగులను మరోసారి కాటేయడం మొదలు పెట్టింది. పగలనక, రాత్రనక పనిమీదే ధ్యాసపెట్టే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఇప్పుడు ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా అనే బెంగతో బతుకుతున్నారు. ఉద్యోగం పోయినవాళ్లు నడి సంద్రంలో చిక్కుకున్నట్లు విలవిలలాడుతుంటే, పనిచేస్తున్నవారేమో ఎప్పుడు పిడుగులాంటి వార్త వినవస్తుందోనని వణికిపోతున్నారు. చిన్న, పెద్ద కంపెనీలనే భేదం లేదు, సీనియర్, జూనియర్ ఉద్యోగి అన్న పట్టింపులేదు. వరుస పెట్టినట్లు వేలమందిని కంపెనీలు నిర్దాక్షిణ్యంగా ఇంటికి పంపుతున్నాయి. లాభాపేక్షతో పని చేసే ఈ కంపెనీలను తప్పును పట్టేలా లేదు. సాంకేతిక పరిశోధన, నూతన ఆవిష్కారాలను కాదనలేరు. నిన్నటి చదువు నేటి ఉద్యోగానికి పనికి రాదు. నేటి చదువు తలకెక్కేదాకా ఉద్యోగం ఆగదు. ఇదే అదునుగా కంపెనీలు ఉన్న ఉద్యోగులపై పనిభారం పెంచి పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఇంత పని చేయలేను అని చెబితే రేపటి నుంచి రానవసరం లేదని అంటారని నోరు మెదపకుండా వారు ఉండక తప్పడం లేదు. పని చేసి చేసి ఇంటి దాకా పోయే ఓపికలేక ఆఫీసు బయట ఫుట్‌పాత్‌పై పడుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చిత్రం వార్తల్లో వచ్చింది. ప్రభుత్వ రంగం తన ఉద్యోగికి పదవి విరమణ దాకా భరోసా ఇస్తుంది. ప్రైవేటు వ్యవస్థలు మాత్రం రక్తమాంసాలను, మేధస్సును తూకం వేసి ఉద్యోగాల్లో కొనసాగనిస్తాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో కొత్తగా వచ్చిన ఆటోమేషన్, కృత్రిమ మేధ ఇలా వేల ఉద్యోగాలను ఊడ్చేస్తున్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ డెవలపర్స్ చేసే పనులను ఈ రెండు కొత్త పనిముట్లు వేగంగా, తక్కువ ఖర్చుకు చేసి పెట్టే రోజులు రెండేళ్ల క్రితమే మొదలయ్యాయి. 2023 నుండే వాటి ధాటికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రెప రెపలాడుతున్నాయి. నైపుణ్య లేమి అని మన గ్రాడ్యుయేట్లను ఆడిపోసుకొనే రోజులు పోతున్నాయి. ఐఐటిలో చదివిన వారికి కూడా ఉద్యోగం గ్యారంటీ లేదు. పది, ఇరవై ఏళ్ల అనుభవం, అద్భుత వృత్తి పరిజ్ఞానం ఉన్నా ఉద్యోగాన్ని కాపాడలేకపోతున్నాయి. కొత్త సాంకేతిక ఆవిష్కారాల వల్ల తక్కువ ఉద్యోగులతోపాటు ఖర్చు, సమయం ఆదా అవుతుంటే ఏ కంపెనీ అయినా అటువైపే అడుగులు వేస్తుంది. ఏడాదికేడాది కంప్యూటర్ డెవలపర్ల అవసరాలు తీరిపోతాయని నిపుణులు అంటున్నారు. మనిషి చేసే పనులను యంత్రాలు వేగంగా చేసి పెడుతుంటే వ్యవసాయంతోపాటు నిర్మాణ, ఉత్పత్తి, సేవారంగాల్లో సమూల మార్పులు వచ్చాయి. కొత్తగా వస్తున్న కృత్రిమమేధ కంపెనీలు పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రాజెక్టులపై ప్రభావం చూపి వాటి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తాయని అంటున్నారు. అంటే రేపటి కాలమంతా ఎఐ కంపెనీలదే అన్నమాట. డాక్టర్లు, యాక్టర్లు, టీచర్లు, ఆర్టిస్టులు, డ్రైవర్లు, వెయిటర్లు ఇలా అన్ని వృత్తులు, పనులు కృత్రిమమేధ తక్కువ ఖర్చుతో చేసి పెడుతుంది.



కంప్యూటర్ కోర్సులు చదువుతున్నవారు, వాటిలో చేరబోయేందుకు సిద్ధపడ్డవారు నేటి పరిస్థితులను గమనించి అయోమయంలో పడుతున్నారు. మంచి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ కోర్సులో సీటు వస్తే చాలు, జీవితంలో సెటిల్ అయినట్లే అని నమ్మినవారు సైతం ఉద్యోగం వస్తుందో లేదో అనే డైలమాలో పడిపోయారు. ప్లేస్‌మెంట్ అయినవారికి జాబ్ ఆర్డర్ చేతికి రావడం లేదు. సాఫ్ట్‌వేర్‌ను నమ్ముకుంటే లాభం లేదనే ఆలోచన కూడా ఇప్పుడిప్పుడే మొదలైంది. ఈ సంవత్సరం ఇంజినీరింగ్ సీట్ల ఎంపిక ఈ విషయానికి బలాన్నిస్తోంది. సివిల్, మెకానికల్ సీట్ల వైపు ఆసక్తి పెరిగింది. జెఎన్‌టియు, క్యాంపస్‌లో కంప్యూటర్ అనుబంధ కోర్సుల్లో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎప్పుడైనా తొలి కౌన్సిలింగ్‌లోనే చకచకా భర్తీ అయ్యే ఈ సీట్లు ఇలా మిగిలిపోవడం, సివిల్, మెకానికల్ సీట్లు నిండిపోవడం చూస్తుంటే ఓ కొత్త మార్పు రాబోతుందనిపిస్తోంది. ఇప్పటి వరకు దేశంలోని వివిధ కంపెనీలు 80 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. వాటిలో మైక్రోసాఫ్ట్, టిసిఎస్, గూగుల్ లాంటి కంపెనీలు పెద్ద సంఖ్యలో సిబ్బందిని తగ్గిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పోవడం కొత్తేమి కాదు. అయితే గతంలో తగినన్ని ప్రాజెక్టులు రాకపోవడంతో కంపెనీలు పనిలేని ఉద్యోగులను ఇంటికి పంపేవి. కొత్తవారి రాకతో ఖర్చులు తగ్గించుకునేందుకు తగిన సామర్థ్యం లేని సీనియర్లను తీసేసేవారు. ఇలాంటి సందర్భాల్లో ఉద్యోగం కోల్పోయినవారికి జీతం తక్కువో, ఎక్కువో అయినా మరో కంపెనీలో పని దొరికేది. ఇప్పటి పరిస్థితులు వేరు. కృత్రిమ మేధ ఉధృతికి నిరుద్యోగులైనవారికి మళ్ళీ కొలువు దక్కాలంటే వారు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై పట్టుసాధించాలి. నలభై, యాభై ఏళ్ల వారు కుర్ర విద్యార్థులతో పోటీపడాలి. ఇది ఎందరికి సాధ్యం? ఉద్యోగం కోల్పోయినవారి ఆర్థిక పరిస్థితి కుదేలు అవుతుంది. ఉద్యోగాన్ని నమ్ముకొని బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఇల్లు, కారు కొన్నవారు నెల కిస్తీలు చెల్లించడం ఆగిపోతుంది. బ్యాంకు నిరర్థక ఆస్తుల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు. పరిస్థితి చేయిదాటితే కారు, ఇల్లు వేలం దాకా వెళుతుంది. ఎంత మానసిక క్షోభ కలుగుతుందో అనుభవించేవారికే తెలుసు. ఇంత జరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదంతా మాకు సంబంధం లేని విషయమన్నట్లు వ్యవహరిస్తున్నాయి. వేలమంది ఉద్యోగులు రోడ్డుమీద పడితే దేశ ఆర్థిక పరిస్థితిపై దాని ప్రభావం ఉంటుంది. వందల కోట్ల విలువైన బ్యాంకు అప్పులు నిరర్థక ఆస్తులు అవుతాయి. పరిశ్రమల ఉత్పత్తులు, వ్యాపార, విద్య వైద్య రంగాలు కుదేలు అవుతాయి. విదేశీ మారకం దెబ్బ తింటుంది. దేశవ్యాప్తంగా లక్షల్లో ఉన్న ఈ ఉద్యోగులకు ప్రభుత్వం తరపున ఎలాంటి రక్షణ లేకపోవడం బాధాకరం. పైగా మరిన్ని ఇలాంటి ప్రైవేట్ ఉద్యోగాలను కల్పించే వ్యవస్థల కోసం సర్కారు అర్రులు చాచడం విచిత్రంగా ఉంది. దేశంలో ఆరంభించే విదేశీ, ప్రైవేట్ కంపెనీలకు కోరినన్ని రాయితీలు ఈయడమే కాదు, అందులో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత, పని గంటలు, జీతభత్యాలు తదితర విషయాలపై కూడా కంపెనీలతో చర్చించి రాతపూర్వక ఒప్పందాలు చేసుకోవాలి. తెలంగాణకు వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, వాటి ద్వారా వేల మందికి ఉపాధి కలుగుతుందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల బాగోగుల గురించి కూడా ఇప్పుడే ఆలోచించాలి. ఆకాశ హర్మ్యాలు, అద్దం లాంటి రోడ్లు ఉండే ఫోర్త్ సిటీలో ఎప్పుడు ఊడుతాయో తెలియని ఉద్యోగాలతో రాష్ట్ర ప్రజలకు దక్కేదేమిటి? భారీ పెట్టుబడులతో సంబరపడే ప్రభుత్వ పెద్దలు తెలంగాణ బిడ్డలకు ఇచ్చే హామీలేమిటో స్పష్టం చేయాలి.